www.vishalabharati.com
epaper.vishalabharati.com

శనివారం, హైదరాబాద్
25 అక్టోబర్ 2025
సంపుటి:3 సంచిక: 297


# విశాలభారతి

తెలుగు దినపత్రిక

## బిజి బిజీగా ఫిరాయింపు ఎమ్మెల్యేలు

- రాష్ట్రంలో ఫిరాయింపు ఎమ్మెల్యేల వ్యవహారం
- ఇరువర్గాలు స్పీకర్ ముందు మౌఖిక వాదనలు
- 10మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేల విచారణ
- సెప్టెంబర్ 29-అక్టోబర్ 1 వరకు తొలి దశ

02



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న 10మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేల విచారణ ప్రక్రియలో భాగంగా అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ శుక్రవారం మరోసారి విచారణ కొనసాగించారు.



## బస్సు ప్రమాదంలో కన్నీటి గాథలు

- కర్నూలు జిల్లాలో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు దగ్ధం
- 19 ప్రయాణికుల జీవితాలు బలి
- మాంసపు ముద్దలా శరీరాలు
- 13 మంది తెలంగాణవాసులు
- తల్లీ కూతుళ్లు సజీవ దహనం
- ఇద్దరు పిల్లలతో సహా భార్య భర్త మృతి
- బస్సుల నిర్వహణలో లోపాలు
- మొత్తం రూ.23,120 ఫైన్లు పెండింగ్
- ఘటనా స్థలానికి గద్వాల జిల్లా కలెక్టర్, ఎస్పీ

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదు.. ఏ క్షణం ఎలా ఉంటుందో చెప్పలేము అన్న పాత మాట ఎంత నిజమో అని నిరూపిస్తూ.. విధి ఆడిన వింత నాటకానికి నిదర్శనంగా నిలిచింది కర్నూలు జిల్లా చిన్నటేకూరు వద్ద జరిగిన ఘోర బస్సు ప్రమాదం. దీపావళి పండుగ సందడి ముగిసిన.. మరికొన్ని గంటల్లోనే తమ గమ్యస్థానాలకు చేరుకోవాలనుకున్న 19 ప్రయాణికుల జీవితాలు అగ్ని ప్రమాదానికి బలైపోయాయి. దురదృష్టకర రాత్రి హైదరాబాద్ నుంచి బెంగళూరుకు బయలుదేరిన ఆ బస్సులో ఉన్న ప్రతి ఒక్కరిదీ ఒక కథ. కొందరు పండుగ సెలవులు ముగించుకుని ఉద్యోగాలకు తిరిగి వెళ్తున్నవారు..



మరికొందరు తమ భవిష్యత్తు కోసం ఇంటర్వ్యూలకు వెళ్తున్న యువత.. వీరందరి ప్రయాణ లక్ష్యాలు వేరు కావొచ్చు, కానీ వారి తుది గమ్యం మాత్రం ఆ మృత్యువు ఒడిలోనే దాగి ఉందని ఎవ్వరూ ఊహించలేదు. మెదక్ జిల్లా శివ్వాయిపల్లికి చెందిన మంగ సంధ్యారాణి (43) , ఆమె కుమార్తె మంగ చందన (23)ల కథ కన్నీళ్లు తెప్పిస్తోంది. సంధ్యారాణి భర్త మంగ ఆనందకుమార్ గౌడ్ మస్కట్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తుండేవారు. కుమార్తె చందన బెంగళూరులో.. కుమారుడు వల్లభ అలహాబాద్‌లోని ఐఐటీలో చదువుతున్నారు. బంధువుల పెళ్లి, దీపావళి వేడుకల కోసం ఈ కుటుంబమంతా ఒక్కటయ్యారు. పండుగ ముగిశాక ఆనంద్‌కుమార్ మస్కట్‌కు వెళ్లిపోయారు.

జ్వరం కారణంగా సంధ్యారాణి ప్రయాణం వాయిదా పడింది. తల్లిని చూసుకోవడానికి చందన కూడా హైదరాబాద్‌లోనే ఉండిపోయింది. సంధ్యారాణికి జ్వరం తగ్గగానే.. కుమార్తెను బెంగళూరులో దించి, అక్కడి నుంచి తను మస్కట్‌కు వెళ్లాలని ప్రణాళిక వేసుకున్నారు. కానీ.. ఆ వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సు వారి ప్రయాణాన్ని శాశ్వతంగా నిలిపివేసింది. నిండు జీవితాలు, నిద్రలోనే సజీవ దహనం అయ్యాయి. ఒకే కుటుంబంలో,

మిగతా 2లో..

కర్నూలు జిల్లాలో జరిగిన ఘోర బస్సు ప్రమాదం రాష్ట్రాన్ని కుదిపేసింది. హైదరాబాద్ నుండి బెంగళూరు వెళ్తున్న వేమూరి కావేరీ ట్రావెల్స్ వోల్వో బస్సు, కల్లూరు మండలం చిన్నటేకూరు వద్ద ఒక బైక్‌ను ఢీకొట్టింది. ఆ బైకర్ అతివేగంగా బైక్ నడుపుతూ.. కంట్రోల్ కోల్పోయాడు. రోడ్డుపై వర్షం కారణంగా స్లిప్ అవడంతో బైక్ నేరుగా బస్సు చక్రాల కిందకు వెళ్లిపోయింది. ఆ బైక్ బస్సు కింద ఇరుక్కుపోవడంతో డీజిల్ ట్యాంకర్‌ను ఢీకొట్టింది. క్షణాల్లోనే మంటలు చెలరేగాయి. తెల్లవారుజామున 3.30 గంటల సమయంలో జరిగిన ఈ ప్రమాదంలో బైకర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మంటలు బస్సు ముందు భాగంలో వ్యాపించాయి. డ్రైవర్, సహాయకుడు మొదట చిన్న మంటలని భావించి ఆర్పేందుకు ప్రయత్నించారు కానీ మంటలు వేగంగా వ్యాపించడంతో వారు బయటకు దూకారు. కానీ ప్రయాణికులను.. అలర్ట్ చేయకపోవడం పెద్ద తప్పిదంగా మారింది.


# మృత్యు ప్రయాణం

## కర్నూలు జిల్లాలో ఘోర బస్సు ప్రమాదం

- హైదరాబాద్- బెంగళూరు వెళ్తున్నకావేరీ బస్సు
- చిన్నటేకూరు వద్ద ఒక బైక్‌ను ఢీకొట్టింది
- బస్సులో 40 మంది ప్రయాణం
- మొత్తం 19 మంది ప్రాణాలు కోల్పోయారు
- ప్రధాని మోదీ, తెలంగాణ సీఎం రేవంత్, ఏపీ సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి
- బస్సుపై తెలంగాణలో 16 చలాన్లు
- మొత్తం రూ.23,120 ఫైన్లు పెండింగ్
- స్లీపర్ బస్సులపై అనేక దేశాలు నిషేధం

విశాలభారతి, స్టేట్ బ్యూరో: బస్సులో నిద్రలో ఉన్న ప్రయాణికులు మంటలు వ్యాపించేలోపు స్పందించలేకపోయారు. వోల్వో ఏసీ బస్సు కావడంతో విండోస్ అన్నీ మూసివేసి ఉండటంతో బయటకు రావడం కష్టమైంది. పొగ కారణంగా ఊపిరాడకపోవడంతో పరిస్థితి మరింత విషమించింది. చివరికి ఒకరు ఎమర్జెన్సీ విండో పగలగొట్టి కిందకు దూకారు. అతనితో పాటు మరో 11 మంది.. బయటపడ్డారు. కానీ మిగతా వారు బయటకు రాలేక బస్సులోనే చిక్కుకుని దుర్మరణం చెందారు. ఫైర్ సిబ్బంది మూడు ఫైరింజన్లతో చేరినా అప్పటికే బస్సు పూర్తిగా కాలిపోయింది. మొత్తం 19 మంది ప్రాణాలు కోల్పోయినట్లు పోలీసులు ధృవీకరించారు. డ్రైవర్, సహాయకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనతో కుటుంబాలు విషాదంలో మునిగిపోయాయి.

02





## 'చిన్న' ఉపశమనం

- చిన్న కాంట్రాక్టర్లకు బిల్లుల మంజూరు
- రిలీజ్ చేసిన మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి
- త్వరలో రూ.11 వేల కోట్లతో హ్యామ్ రోడ్లు
- 32 ప్యాకేజీల్లో 400 రోడ్లు నిర్మాణం
- రూ.50 కోట్ల పెండింగ్ బిల్లులు చెల్లిస్తాం
- బిల్డర్స్ అసోసియేషన్ ధన్యవాదాలు

02

## ఇక నో జాయింట్ కలెక్టర్స్!

- రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం
- జాయింట్ కలెక్టర్ పదవిని రద్దు చేసింది
- ఫారెస్ట్ యాక్ట్ కింద ఉత్తర్వులు
- తగిన చర్యలు చేపట్టాలని ఆదేశాలు
- ఫారెస్ట్ సెటిల్‌మెంట్ ఆఫీసర్లుగా విధులు
- వీరిని 1927 చట్టం ప్రకారం నియమిస్తారు



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణలో జాయింట్ కలెక్టర్ పదవిని రద్దు చేస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అన్ని జిల్లాల అదనపు కలెక్టర్లను ఫారెస్ట్ సెటిల్‌మెంట్ ఆఫీసర్లుగా నియమిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలో అడవి భూ సర్వే, హక్కుల నిర్ధారణ,

మిగతా 2లో..

- కర్నూలు ప్రైవేటు ట్రావెల్ బస్సు ప్రమాదం
- దక్షిణాది రాష్ట్రాలు అలర్ట్ అయ్యాయి
- మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు
- ప్రమాదంపై సీఎం రేవంత్ రెడ్డి కాన్ఫరెన్స్
- బస్సు ఓనర్లు, ట్రావెలర్లను హెచ్చరికలు జారీ
- హత్యా నేరం కింద జైలుకి పంపిస్తామన్నారు

## ప్రైవేట్ ట్రావెల్స్‌కు దబిడి దిబిడే



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

కర్నూలు ప్రైవేటు ట్రావెల్ బస్సు ప్రమాదం నేపథ్యంలో దక్షిణాది రాష్ట్రాలు అలర్ట్ అయ్యాయి. ఈ వ్యవహారంపై కేవలం ఏపీ మాత్రమే కాకుండా, మిగతా 2లో..

## నవీన్ కోసం రంగంలోకి సీఎం రేవంత్



### జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలు జోరు


- కాంగ్రెస్ అభ్యర్థిగా నవీన్ యాదవ్
- ప్రచారంలో రాజకీయ ప్రముఖులు
- త్వరలో సీఎం రేవంత్ పాల్గొనే అవకాశం
- ప్రతిష్ఠాత్మకంగా జూబ్లీహిల్స్‌లో గెలుపు
- ముగ్గురు మంత్రులకు ప్రచార బాధ్యతలు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ తరపున మంత్రి సీతక్క ప్రచారం చేశారు. శుక్రవారం బోరబండలో నిర్వహించిన స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లో ఆమె మాట్లాడుతూ.. నవీన్ యాదవ్ విజయం జూబ్లీహిల్స్ అభివృద్ధికి కొత్త మలుపు అవుతుందని సీతక్క అన్నారు. మూడు పర్యాయాలు ఇక్కడ బీఆర్ఎస్ పార్టీ గెలిచినా, ఇప్పటికీ ప్రజలు నీటి సమస్యలు, డ్రైనేజ్ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. "ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మున్సిపల్ శాఖను స్వయంగా చూస్తున్నారు. కాబట్టి నవీన్ యాదవ్ ఎమ్మెల్యేగా గెలిస్తే జూబ్లీహిల్స్ సమస్యలు

మిగతా 2లో..

## జూబ్లీహిల్స్ బరిలో 58 మంది అభ్యర్థులు




- జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నిక
- నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ పూర్తి
- పోటీకి 58 మంది అభ్యర్థులు
- 23మంది ఉపసంహరించుకున్నారు
- మొత్తంగా 321 నామినేషన్లను దాఖలు
- 186 నామినేషన్లను తిరస్కరణ

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉపఎన్నికల్లో నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణల ప్రక్రియలు పూర్తయిన తర్వాత, చివరికి 58 మంది అభ్యర్థులు పోటీకి మిగిలారు. దాఖలైన నామినేషన్లతో పోలిస్తే ఈ సంఖ్య తక్కువే అయినా ఈ నియోజకవర్గంలో ఇంత భారీగా పోటీలో ఉండటం ఇదే మొదటి సారి. అక్టోబర్ 14 నుంచి 16 వరకు జరిగిన నామినేషన్ల సమయంలో పెద్ద ఎత్తున అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసారు. పరిశీలనలో చాలా నామినేషన్లు చెల్లకుండా పోయాయి. చెల్లిన వారిలో 23మంది ఉపసంహరించుకున్నారు. ఫలితంగా 58 మంది మాత్రమే పోటీలో ఉన్నారు. ఈ సంఖ్య గత ఎన్నికలతో పోలిస్తే గణనీయంగా ఎక్కువ.

మొత్తం 211 మంది అభ్యర్థులు మొత్తంగా 321 నామినేషన్లను దాఖలు చేశారు. నామినేషన్ల పరిశీలన గురువారం తెల్లవారుజామున 3 గంటల దాకా కొనసాగింది. మొత్తం 321 నామినేషన్లను పరిశీలించిన రిటర్నింగ్ అధికారి.. 186 నామినేషన్లను తిరస్కరించారు. మిగిలిన 135 నామినేషన్లు సక్రమంగా ఉన్నట్టు తేల్చారు. నామినేషన్ల పరిశీలన అనంతరం 130 మందికి చెందిన నామినేషన్లను వివిధ కారణాలతో తిరస్కరించగా, 81 మంది అభ్యర్థుల నామినేషన్లకు ఆమోదం తెలిపారు. వారిలో 23 మంది ఉపసంహరించుకున్నారు.

2009 ఎన్నికల్లో 13 మంది, 2014లో 21 మంది, 2018లో 18 మంది పోటీ పడ్డారు. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 19 మంది పోటీ పడ్డారు. ఈ 19 మందిలో బీఆర్ఎస్ తరపున పోటీ

మిగతా 2లో..





# మృత్యు ప్రయాణం

(మొదటిపేజీ తరువాయి)

మృతుల కుటుంబాలకు ప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఏపీ సీఎం చంద్రబాబు, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మాజీ సీఎం కేసీఆర్‌తో పాటు కేటీఆర్, మంత్రులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, క్షతగాత్రులకు రూ.50 వేలు చొప్పున పరిహారం ప్రకటించారు. ఈ ఘటనపై సీఎం రేవంత్ రెడ్డి, సీఎస్ రామకృష్ణారావు, డీజీపీ శివధర్‌రెడ్డితో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తక్షణమే ప్రభుత్వం తరపున అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

ఈ ప్రమాద ఘటనతో కావేరీ ట్రావెల్స్ బస్సు తప్పిదాలుకూడా ఒక్కొక్కటిగా వెలుగుచూస్తున్నాయి. ప్రయాణికుల భద్రతను పట్టించుకోకుండా.. ఇష్టారాజ్యంగా బస్సును నిర్మించారనే ఆరోపణలు కూడా తెరపైకి వచ్చాయి. ఈ క్రమంలోనే షాకింగ్ విషయం వెలుగుచూసింది. ఈ బస్సును సీటింగ్ పర్మిషన్ తీసుకుని.. స్లీపర్‌గా మార్చి నడిపిస్తున్న విషయం వెలుగులోకి వచ్చింది. ప్రమాదానికి గురైన కావేరి ట్రావెల్స్ బస్సు.. తొలుత డయ్యూ డామన్‌లో వాహనం రిజిస్ట్రేషన్ చేసుకుంది. అక్కడి నుంచి ఆల్ ఇండియా పర్మిట్ తీసుకుంది.

ఆ తర్వాత ఒడిశాలోని రాయగడలో ఆల్ట్రేషన్‌తో పాటుగా ఫిట్‌నెస్ చేయించారు. ఆల్ట్రేషన్‌లో రాయగడ రవాణా శాఖ అధికారుల నుంచి సీటింగ్ పర్మిషన్ తీసుకున్నారు. అయితే ఆ తర్వాత కావేరి ట్రావెల్స్ యాజమాన్యం 43 సీట్ల సీటింగ్ కోసం



అనుమతి తీసుకున్న బస్సును స్లీపర్‌గా మార్చింది. అనంతరం 2018 సంవత్సరంలో ఈ బస్సును తెలంగాణలో రిజిస్ట్రేషన్ చేయించారు. 2023లో ఎన్‌వోసీతో డయ్యూడామన్‌తో మళ్లీ రిజిస్ట్రేషన్ చేయించి.. స్లీపర్ కోచ్‌గా మార్చినట్లు తెలిసింది. అయితే ప్రమాద ఘటనపై కావేరీ ట్రావెల్స్ యాజమాన్యం ఇప్పటి వరకూ స్పందించలేదు.

ఈ ప్రమాదానికి గురైన బస్సుపై తెలంగాణలో 16 చలాన్లు ఉన్నాయి. దాంతో ఈ బస్సుకు సంబంధించి మొత్తం రూ.23,120 ఫైన్లు పెండింగ్‌లో ఉన్నాయి. 2024 జనవరి 27 నుంచి 2025 అక్టోబరు 9 వరకు ఈ బస్సు 16 సార్లు ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించినట్లు తెలిసింది. 9 సార్లు నో ఎంట్రీ జోన్‌లోకి ప్రవేశించడంతో జరిమానాలు పడ్డాయి. హైస్పీడ్, డేంజరస్ డ్రైవింగ్ ఉల్లంఘనల పైనా చలాన్లు పడినట్లు తెలిసింది. రవాణా శాఖ అధికారులు ఈ ప్రమాదంపై అన్ని కోణాల్లో సమగ్ర దర్యాప్తు చేస్తున్నారు. బస్సు యాజమాన్యం, డ్రైవింగ్ విధానం, భద్రతా ప్రమాణాల అమలు, అగ్నిమాపక పరికరాల లభ్యత వంటి అంశాలపై విస్తృతంగా విచారణ జరుగుతోందని పేర్కొన్నారు. దర్యాప్తు పూర్తయిన తర్వాత నివేదికను ప్రభుత్వం సమీక్షిస్తుంది. ఆ నివేదిక ఆధారంగా భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా నిరోధక చర్యలు తీసుకోనున్నారు. ప్రపంచవ్యాప్తంగా స్లీపర్ బస్సులు అనేక సార్లు ప్రమాదాలు గురయ్యాయి. చైనాలో 2009 తర్వాత నుంచి 13 స్లీపర్ బస్సు ప్రమాదాలు జరిగ్గా.. ఏకంగా 252 మంది ప్రాణాలు కోల్పోయారు. దీంతో 2012లో వీటిపై చైనా నిషేధం విధించింది. ఇక కొన్ని దేశాలు స్లీపర్ బస్సుల వినియోగాన్ని క్రమంగా తగ్గించుకుంటున్నాయి. భద్రతా కారణాలు పేర్కొంటూ 2006లో జర్మనీ బ్యాన్ చేసింది. స్లీపర్ బస్సుల వినియోగంపై వియత్నాంలో కూడా పెద్ద ఎత్తిన చర్చ జరుగుతోంది. భారత్‌లో మాత్రం ప్రభుత్వాలు నిబంధనలు రూపొందించి చేతులు దులుపుకుంటున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వరుస ప్రమాదాల దృష్ట్యా.. ఈ బస్సులను బ్యాన్ చేసే బదులు.. కేంద్ర ప్రభుత్వం కఠిన నిబంధనలు రూపొందించింది. ఆటోమోటివ్ ఇండస్ట్రీ స్టాండర్డ్ (AIS) 119 పేరుతో స్లీపర్ కోచ్‌ల్లో పాటించాల్సిన నిబంధనలు తీసుకొచ్చింది. దీని ప్రకారం బస్సులో ఫైర్ సేఫ్టీ నిబంధనలు కచ్చితంగా పాటించాలి. సరైనా బెర్తుల లేఅవుట్ ఉండాలి. బస్సులో మండే స్వభావం లేని వస్తువులను మాత్రమే ఉపయోగించాలి. దురదృష్టవశాత్తు ఈ నిబంధనలను చాలా ప్రైవేటు ట్రావెల్స్ కంపెనీలు పాతరేస్తున్నాయి. నిబంధనలకు పూర్తిగా విరుద్ధంగా బస్సులను నడిపిస్తున్నాయి. ఇష్టారీతిన బెర్తుల లేఅవుట్లు, ఫిట్‌నెస్ లేని బస్సులు ఉపయోగిస్తున్నారు. వాటిని సులభ నిబంధనలు ఉన్న రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నాయి. ఇక అధికారులు నిబంధనలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమవుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయ. అందుకే దేశవ్యాప్తంగా, ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో ఇలాంటి ఘటనలు ఎక్కువగా జరుగుతున్నట్లు నిపుణులు చెబుతున్నారు.

# 'చిన్న' ఉపశమనం

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

రాష్ట్ర వ్యాప్తంగా సుమారు రూ.11 వేల కోట్లతో హ్యామ్ రోడ్లను నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. మొత్తం 32 ప్యాకేజీల్లో 400 రోడ్లు నిర్మిస్తామని తెలిపారు. హ్యామ్ రోడ్ల టెండర్లలో చిన్న కాంట్రాక్టర్లు కూడా పాల్గొనవచ్చని తెలిపారు. 2026 నూతన సంవత్సరంలో హ్యామ్ రోడ్ల పనులు మొదలు పెడుతామని స్పష్టం చేశారు. బిల్లుల చెల్లింపుల విషయంలో ఎవరు ఆందోళన చెందాల్సిన అక్కర్లేదని, వచ్చే రెండేళ్లలో దేశానికే రోల్ మోడల్ రోడ్లు తెలంగాణలో నిర్మిస్తామని పేర్కొన్నారు. దేశంలో అద్దం లాంటి రోడ్లకు కేరాఫ్ అడ్రస్ గా తెలంగాణ నిలవబోతుందని ధీమా వ్యక్తం చేశారు. హ్యామ్ రోడ్ల నిర్మాణంలో, బిల్లుల చెల్లింపులో ఆర్ అండ్ బీ శాఖకు పూర్తి అండగా నిలుస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రోడ్ల నిర్మాణం పనులు జరిగేటప్పుడు వాహనదారులు తగు జాగ్రత్తలు పాటించాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా యువత హెల్మెట్ ధరించాలి, డ్రంక్ అండ్ డ్రైవ్, సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ లాంటివి చేయొద్దని సూచించారు. నిర్లక్ష్యపు డ్రైవింగ్ తో ప్రమాదం బారిన పడి, కన్న తల్లిదండ్రులకు శోకాన్ని మిగల్చవద్దు అన్నారు. ఆర్ అండ్ బీ చిన్న కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లుల మంజూరుకు మంత్రి కృషి చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మంత్రి మాట్లాడి రూ.100 కోట్ల పెండింగ్ బిల్లుల పేమెంట్ కు సంబంధించిన నిధులు మంజూరు చేయించారు. మిగతా రూ.50 కోట్ల పెండింగ్ బిల్లులు కూడా త్వరలో చెల్లిస్తామని హామీ ఇచ్చారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాం నుంచి పెండింగ్ లో ఉన్న బిల్లులతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న చిన్న కాంట్రాక్టర్లకు మంత్రి భరోసా ఇచ్చారు. ఏళ్ల తరబడి పెండింగ్ లో ఉన్న బిల్లులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, అందుకు కృషి చేసిన ఆర్ అండ్ బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి బిల్డర్స్ అసోసియేషన్ ధన్యవాదాలు తెలిపారు.

రాష్ట్రవ్యాప్తంగా ఆర్అండ్‌బీ పరిధిలో రోడ్ల మరమ్మతుల నుంచి వంతెనల నిర్మాణం వరకు పనులు చేపట్టే కాంట్రాక్టర్ల సంఖ్య 1000 మందికి పైగా ఉన్నది. ఇందులో 90 శాతం కాంట్రాక్టర్లు రూ.1 కోటిలోపు విలువైన పనులు చేపట్టేవారు ఉంటారు. మరో 8 శాతం మంది రూ.50 కోట్ల లోపు విలువచేసే పనులు చేపట్టే సామర్థ్యం ఉన్నవారు ఉంటారు. అంతకుమించి వ్యయం అయ్యే పనులు చేపట్టే ఏజెన్సీల సంఖ్య కేవలం 2శాతం మాత్రమే ఉన్నది. ఆర్అండ్‌బీ శాఖలో రూ.10 కోట్లకన్నా తక్కువ వ్యయమయ్యే పనులే ఎక్కువగా ఉంటాయి. ఇందులో రోడ్ల మరమ్మతులు, కల్వర్టుల నిర్మాణం వంటి పను లు ఉంటాయి. రూ.10 నుంచి రూ.50 కోట్లలోపు పనులు దక్కించుకునే ఏజెన్సీలు సైతం చాలావరకు తమ పనులను చిన్న కాంట్రాక్టర్లకే సబ్‌కాంట్రాక్టు కింద ఇస్తాయి. దీంతో చిన్న కాంట్రాక్టర్లకు ఏడాదిపాటు చేతినిండా పని లభించడమే కాకుండా రోడ్ల మరమ్మతులు కూడా ఎప్పటికప్పుడు పూర్తవుతాయి.

# నవీన్ కోసం రంగంలోకి సీఎం రేవంత్

(మొదటిపేజీ తరువాయి)

త్వరగాపరిష్కారం అవుతాయి," అనిచెప్పారు. అంతేకాకుండా.. మీరు నవీన్ యాదవ్‌కు ఒక అవకాశం ఇస్తే, అభివృద్ధి, సంక్షేమ పథకాలు మీ ఇంటికే వస్తాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఇళ్లు, రేషన్ కార్డులు, ఉచిత విద్యుత్, చవక గ్యాస్ సిలిండర్లు అందిస్తోందని, ఒక్క జూబ్లీహిల్స్‌లోనే రూ.150 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు ఇప్పుడు నవీన్ యాదవ్‌పై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆమె మండిపడ్డారు. కానీ ఒకప్పుడు కేసీఆర్ పార్టీకి శ్రీశైలం యాదవ్ కుటుంబం ఆర్థిక సహాయం చేసింది. ఆ కుటుంబాన్ని ఇప్పుడు విమర్శించడం ప్రజలు సహించరని అన్నారు.



అయితే జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక వేళ కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. మూడు ప్రధాన పార్టీల నేతలు ఇక్కడే మోహరించారు. కాంగ్రెస్ కు ఇక్కడ గెలుపు కీలకంగా మారుతోంది. బీఆర్ఎస్ సైతం ఈ ఎన్నికలో గెలుపే లక్ష్యంగా పని చేస్తోంది. గెలుపు పైన మూడు పార్టీల నేతలు పైకి ధీమా వ్యక్తం చేస్తున్నా.. సర్వే నివేదికలు మాత్రం గుబులు పుట్టిస్తున్నాయి. దీంతో, సీఎం రేవంత్ స్వయంగా ఈ ఎన్నిక ప్రచారంలోకి దిగాలని డిసైడ్ అయ్యారు. మంత్రులకు బాధ్యతలు కేటాయిస్తున్నారు. కాగా, జూబ్లీహిల్స్ లో మారుతున్న లెక్కలు ఫలితం పై ఉత్కంఠ పెంచుతున్నాయి.

జూబ్లీహిల్స్ లో గెలుపు ఇప్పుడు సీఎం రేవంత్ కు ప్రతిష్ఠాత్మకంగా మారింది. అభ్యర్థి విషయంలో రేవంత్ ఏరి కోరి ఎంపిక చేయటంతో పాటుగా.. పార్టీ నాయకత్వం.. ఎంఐఎంను ఒప్పించారు. ఇక, ఇప్పుడు గెలుపు కోసం కొత్త వ్యూహాలు అమలు చేస్తున్నారు. ఇందు కోసం మంత్రులతో ప్రత్యేకంగా భేటీకి నిర్ణయించారు. శనివారం సీఎం రేవంత్ ఢిల్లీ వెళ్లనున్నారు. అక్కడ ఏఐసీసీ ఆఫీసులో జరిగే పార్టీ సమావేశంలో పాల్గొంటారు. వచ్చిన తరువాత మంత్రులు.. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో పని చేస్తున్న పార్టీ నేతలతో సమావేశం కానున్నారు. తాజా సర్వే నివేదికల గురించి సీఎం వివరించే అవకాశం ఉంది. అదే విధంగా బీఆర్ఎస్, బీజేపీ వ్యూహాలకు ధీటుగా ఎలా ప్రచారం ముమ్మరం చేయాలనేది రేవంత్ డిసైడ్ చేయనున్నారు.

ఇప్పటికే ముగ్గురు మంత్రులకు సీఎం రేవంత్ జూబ్లీహిల్స్ ప్రచార బాధ్యతలను అప్పగించారు. ఇప్పుడు ఒక్కో డివిజన్ కు ముగ్గురు మంత్రుల చొప్పున బాధ్యతలు అప్పగించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసారు. అదే విధంగా ప్రతీ ఇంటికి ప్రచారానికి వెళ్లేలా కార్యాచరణ ఖరారు చేసారు. ఇక, ప్రచారం చివరి మూడు రోజులు రేవంత్ రోడ్ షోలు.. సభల్లో పాల్గొనేలా ప్లాన్ సిద్ధం చేస్తున్నారు. తాజాగా మాజీ సీఎం కేసీఆర్ జూబ్లీహిల్స్ ఎన్నికల్లో గెలుపు ఖాయమని పార్టీ నేతల సమావేశంలో ధీమా వ్యక్తం చేసారు.

# ఇక నో జాయింట్ కలెక్టర్స్!

(మొదటిపేజీ తరువాయి)

సెటిల్‌మెంట్ పనులు వీరి పరిధిలోకి వస్తాయి. 1967 ఫారెస్ట్ యాక్ట్ కింద రేవంత్ సర్కార్ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ పర్యవేక్షణలో దీనిని అమలు చేయనుంది. ఈ మేరకు అన్ని జిల్లాల కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు తగిన చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేసింది.

ఫారెస్ట్ సెటిల్‌మెంట్ ఆఫీసర్లు.. అటవీ భూముల హక్కులు, అటవీ ప్రాంతాల నిర్ధారణ చేపడతారు. వీరిని 1927 చట్టం ప్రకారం నియమిస్తారు. వీళ్లు భూముల వివరాలను పరిశీలించడం, అవకతవకలు ఉన్నవాటిపై విచారణ నిర్వహించడం, అటవీ భూములకు సంబంధించిన ప్రకటనలు జారీ చేయడం వంటివి చేస్తారు. అటవీ ప్రాంతంలోకి ప్రవేశించే అధికారం వీరికి ఉంటుంది. అదనపు కలెక్టర్ పదవిలో ఉన్న అధికారులు కలెక్టర్‌కు సహాయంగా రెవెన్యూ కార్యకలాపాలు, భూముల కేటాయింపులు, పౌరసరఫరాలు, భూభారతి వంటి అంశాలన పర్యవేక్షిస్తారు. అదే విధంగా గ్రామ పంచాయతీలు, పురపాలక సంఘాల స్థానిక సంస్థల అభివృద్ధి ప్రణాళికలను చూసుకుంటారు. పరిశుభ్రత, పచ్చదనం వంటి ప్రత్యేక కార్యక్రమాలను అమలు చేయడంతో పాటు, వాటిని సమర్థవంతంగా నిర్వహించడానికి అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహిస్తారు. వివిధ ప్రభుత్వ పథకాల అమలును పర్యవేక్షిస్తారు మరియు క్షేత్రస్థాయిలో సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తారు. కలెక్టర్, జాయింట్ కలెక్టర్ తర్వాత వీరు ముఖ్యంగా ఉంటారు.



గత బీఆర్ఎస్ ప్రభుత్వం కలెక్టర్ స్థానాలను రద్దు చేస్తూ.. వారి స్థానంలో అడిషనల్ కలెక్టర్(ఏడీసీ) అనే కొత్త పోస్టులను ప్రవేశపెట్టింది. ప్రస్తుతం ఉన్న జేసీలనే అడిషనల్ కలెక్టర్లుగా మారుస్తూ వారికి పోస్టింగులు ఇచ్చింది. ఈ మేరకు ఆ సమయంలో 49 మంది నాన్ కేడర్, కేడర్ అధికారులను బదిలీ చేసింది. అడిషనల్ కలెక్టర్లకు స్థానిక సంస్థల పర్యవేక్షణను అదనపు బాధ్యతలుగా అప్పగించింది. అంతేకాక 2017 బ్యాచ్ ఐఏఎస్‌లకే ఈ పోస్టింగులు ఇవ్వడం గమనార్హం. అలానే జిల్లాల్లో పని చేస్తున్న జేసీలకు అడిషనల్ కలెక్టర్లుగా పోస్టింగులు ఇచ్చింది. మరి కొంతమందిని అడిషనల్ కలెక్టర్లుగా నియమించింది. ఈ క్రమంలోనే భారీ సంఖ్యలో ఐపీఎస్‌లను బదిలీ చేశారు. ఇక ఒక్కో జిల్లాకు వచ్చి ఒకరు, ఇద్దరు, లేదా ముగ్గురు అడిషనల్ కలెక్టర్లను నియమించారు.

# ప్రైవేట్ ట్రావెల్స్‌కు దబిడి దిబిడే


(మొదటిపేజీ తరువాయి)

తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల ప్రభుత్వాలు అటువైపు దృష్టి పెట్టాయి. దీనిపై తెలంగాణ ఆర్టీసీ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. కర్నూలు బస్సు ప్రమాద ఘటన చాలా దురదృష్టకరమైందని అన్నారు. మృతులందరికీ తమ సంతాపం తెలిపారు. ఈ ఘటనపై ఏపీకి చెందిన రవాణా శాఖ మంత్రి, కలెక్టర్, డీఐజీతో ఫోన్‌లో మాట్లాడి సమాచారం తెలుసుకున్నట్లు వివరించారు. కర్నూలు బస్సు ప్రమాదంపై సమగ్ర విచారణ చేస్తున్నామన్నారు. అవసరమైన సహాయక చర్యలు తీసుకుంటామన్నారు. హైదరాబాద్ నుంచి బస్సు బయలుదేరిన నేపథ్యంలో ఘటనపై విచారణకు ఆదేశాలు ఇచ్చినట్టు తెలిపారు.

కర్నూల్ లో జరిగిన ఘోర బస్సు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు తెలంగాణ సర్కార్ ఆర్థిక సాయం అందించింది. ఈ దుర్ఘటనలో మృతి చెందిన కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం తరుపున రూ. 5 లక్షలు, క్షతగాత్రులకు రూ. 2లక్షల చొప్పున ఎక్స్ గ్రేషియా ప్రకటించింది. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. బస్సు ప్రమాద ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాన్ఫరెన్స్ నిర్వహించారు. సీఎస్ రామకృష్ణారావు, డీజీపీ శివధర్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు. తక్షణమే ప్రభుత్వం తరపున అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. బాధిత కుటుంబాలకు అవసరమైన సాయం అందించేందుకు.. జెన్‌కో సీఎండీ హరీష్‌ను వెంటనే ప్రమాదం జరిగిన చోటుకు వెళ్లాలని ఆదేశాలు జారీ చేసారు. ఇదే క్రమంలో బస్సు ఓనర్లు, ట్రావెలర్లను సూటిగా హెచ్చరించారు మంత్రి పొన్న ప్రభాకర్. ఫిట్‌నెస్, ఇన్సురెన్స్, ఇతర అంశాలపై నిర్లక్ష్యం వహిస్తే హత్యా నేరం కింద జైలుకి పంపిస్తామన్నారు. ఈ విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. నియమ నిబంధనలు పాటించాలని, ప్రాణాలతో చెలగాటం వద్దని ఘాటు హెచ్చరికలు చేశారు. రవాణా శాఖ రోజువారీ తనిఖీలు చేస్తే వేధింపులు చేస్తున్నట్లు మాట్లాడుతున్నారని అన్నారు. ప్రమాదానికి కారణాలు ఏమైనా కావచ్చు తప్పకుండా చర్యలు చేపడతామన్నారు. ఘటన నేపథ్యంలో ప్రమాదానికి గురైన బస్సు ఒడిషాలో రిజిస్టర్ అయినట్టు వెల్లడించారు. ఈ బస్సు.. హైదరాబాద్ నుంచి బెంగుళూరు మధ్య తిరుగుతోందన్నారు. 43 సీట్లకు పర్మిషన్ తీసుకున్న బస్సు ఓనర్, దాన్ని స్లీపర్‌గా మార్చాడు. బస్సు విషయంలో ప్రతిచోటా అధికారులతో కుమ్మక్కై ఆల్ట్రేషన్ చేయించాడు. హైదరాబాద్ నుంచి వివిధ రాష్ట్రాలకు బయలుదేరే బస్సుల రాకపోకల వివరాలు నమోదు చేస్తామన్నారు. ప్రతీరోజూ ఈ మూడు రాష్ట్రాల మధ్య వేలాది మంది ప్రయాణం చేస్తారన్నారు. బస్సు వ్యవస్థలో అన్ని రకాల చర్యలు తీసుకునేందుకు తెలంగాణఏపీకర్ణాటక టాన్స్‌పోర్టు మంత్రులుఆ శాఖ కమిషనర్ల సమావేశం త్వరలో జరుగుతుందన్నారు.

# బిజి బిజీగా ఫిరాయింపు ఎమ్మెల్యేలు

- రాష్ట్రంలో ఫిరాయింపు ఎమ్మెల్యేల వ్యవహారం
- ఇరువర్గాలు స్పీకర్ ముందు మౌఖిక వాదనలు
- 10మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేల విచారణ
- సెప్టెంబర్ 29-అక్టోబర్ 1 వరకు తొలి దశ
- నలుగురు ఎమ్మెల్యేల క్రాస్ ఎగ్జామినేషన్
- శుక్రవారం మిగిలిన ఎమ్మెల్యేల విచారణ
- ఈనెల 25 నుంచి 31లోగా విచారణ పూర్తి



(మొదటిపేజీ తరువాయి)

సెప్టెంబర్ 29 నుంచి అక్టోబర్ 1 వరకు జరిగిన తొలి దశ విచారణలో ఇప్పటికే నలుగురు ఎమ్మెల్యేల క్రాస్ ఎగ్జామినేషన్ పూర్తయ్యింది. మిగిలిన ఎమ్మెల్యేల విచారణను శుక్రవారం నుంచి చేపట్టారు. ఉదయం 11గంటలకు కల్వకుంట్ల సంజయ్ వర్సెస్ టి ప్రకాష్ గౌడ్ కేసు, మధ్యాహ్నం 12 గంటలకు చింతా ప్రభాకర్ వర్సెస్ కాలే యాదయ్య కేసు, 2 గంటలకు చింతా ప్రభాకర్ వర్సెస్ గూడెం మహిపాల్ రెడ్డి కేసు, మధ్యాహ్నం 3 గంటలకు పల్లా రాజేశ్వర్ రెడ్డి వర్సెస్ బండ్ల కృష్ణమోహన్ రెడ్డి కేసు విచారణ ప్రక్రియ కొనసాగించారు. ప్రతి కేసులోను ఇరువర్గాలు స్పీకర్ ముందు మౌఖిక వాదనలు వినిపించాయి. ఇప్పటికే ఇరువర్గాలు కూడా తమ వాదనలకు మద్దతుగా ఆధారాలు, అఫిడవిట్లు స్పీకర్ కి అందజేశారు. ఎమ్మెల్యేల విచారణ నేపథ్యంలో శుక్రవారం నుంచి 31 వరకు అసెంబ్లీ పరిసరాల్లో ఆంక్షలు అమలు చేస్తున్నారు. ఈనెల 25 నుంచి 31లోగా మిగిలిన ఎమ్మెల్యేలపై విచారణను పూర్తి చేయనున్నారు. ఇప్పటివరకూ స్పీకర్ నోటీసులకు సమాధానాలివ్వని కడియం శ్రీహరి, దానం నాగేందర్‌లపై కూడా ఈలోగా నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. నలుగురు ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై విచారణ పూర్తి అవుతుంది. ఉదయం 11 గంటలకు కల్వకుంట్ల సంజయ్ వర్సెస్ టి.ప్రకాశ్ గౌడ్, మధ్యాహ్నం 12 గంటలకు చింతా ప్రభాకర్ వర్సెస్ కాలే యాదయ్య, మధ్యాహ్నం 2 గంటలకు చింతా ప్రభాకర్ వర్సెస్ గూడెం మహిపాల్ రెడ్డి, మధ్యాహ్నం 3 గంటలకు పల్లా రాజేశ్వర్ రెడ్డి వర్సెస్ బండ్ల కృష్ణమోహన్ రెడ్డి కేసుల విచారణ కొనసాగించారు. ప్రతి కేసులో ఇరువర్గాలు స్పీకర్ ముందు వాదనలు వినిపించారు. ఇప్పటికే ఇరువర్గాలు తమ ఆధారాలు, అఫిడవిట్లు స్పీకర్‌కు సమర్పించారు. ఈ విచారణల నేపథ్యంలో ఈ రోజు నుంచి 31వ తేదీ వరకు అసెంబ్లీ పరిసరాల్లో పోలీసు ఆంక్షలు అమల్లోకి వచ్చాయి.

పార్టీ ఫిరాయించిన 10 ఎమ్మెల్యేల అనర్హతపై మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలని తెలంగాణ అసెంబ్లీ స్పీకర్‌ను జూలై 31న సుప్రీంకోర్టు ఆదేశించింది. తీర్పు వెలువరించే సందర్భంగా జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ ఆగస్టీన్ జార్జ్ మసీహ్ ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్ల విషయంలో ఆపరేషన్ సక్సెస్.. పేషెంట్ డెడ్ అనే సూత్రం వర్తించకూడదని వ్యాఖ్యానించింది. ఏళ్ల తరబడి పార్టీ ఫిరాయింపు పిటిషన్లను పెండింగ్‌లో ఉంచడం సరికాదని.. ఆలస్యం జరిగే కొద్దీ ఫిరాయింపుదారులు ప్రయోజనం పొందుతారని.. ఇలా చేస్తే అది భారత రాజ్యాంగాన్ని ఉల్లంఘించినట్లే అవుతుందని ధర్మాసనం హాట్ కామెంట్స్ చేసింది. పార్టీ ఫిరాయింపుల చట్టంపై పార్లమెంట్ ఒక నిర్ణయం తీసుకోవాలని సూచించింది. అనర్హత అభియోగాలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలలో దానం నాగేందర్ (ఖైరతాబాద్), ప్రకాష్ గౌడ్ (రాజేంద్రనగర్), గూడెం మహిపాల్ రెడ్డి (పటాన్‌చెరు), అరికెపూడి గాంధీ (శేరిలింగంపల్లి), కాలే యాదయ్య (చేవెళ్ల), సంజయ్ కుమార్ (జగిత్యాల), కడియం శ్రీహరి (స్టేషన్ ఘన్‌పూర్), పోచారం శ్రీనివాస్ రెడ్డి (బాన్సువాడ), తెల్లం వెంకట్రావ్ (భద్రాచలం), బండ్ల కృష్ణమోహన్ రెడ్డి (గద్వాల) ఉన్నారు.

# బస్సు ప్రమాదంలో కన్నీటి గాథలు

(మొదటిపేజీ తరువాయి)

ఒకే ఘటనలో తల్లీకూతుళ్లు కనుమరుగవడం ఆ కుటుంబాన్ని తీరని విషాదంలోకి నెట్టింది. యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన అనూష రెడ్డి, బాపట్ల జిల్లాకు చెందిన ధాత్రి అనే ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు కూడా ఆ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. దీపావళికి ఇంటికి వచ్చి, సంతోషంగా గడిపి, తిరిగి పని ప్రదేశాలకు వెళ్తూ ఇలా కలకాలం సెలవు తీసుకుంటారని వారి తల్లిదండ్రులు కలలో కూడా ఊహించలేదు. బీటెక్ విద్యార్థి జయసూర్య (23) కథ మరో కోణాన్ని చూపింది. ఉద్యోగం కోసం గంపెడాశలతో బెంగళూరులో ఇంటర్వ్యూకు వెళ్తున్న జయసూర్య.. తాను బుక్ చేసుకున్న బస్సు మిస్సవ్వడంతో.. ఛేజింగ్ చేసి మరీ మూసాపేట్‌లో బస్సు ఎక్కాడు. ఎట్టకేలకు బస్సు అయితే ఎక్కాడు.. కానీ ప్రమాదం అతని వెంటనే ఉందని గమనించలేకపోయాడు. అయితే ఆ ప్రమాదం నుంచి అతడు ఎమెర్జెన్సీ ఎగ్జిట్ నుంచి బయటపడి.. తన ప్రాణం పోకుండా కాపాడుకున్నాడు.

నెల్లూరు జిల్లా వింజమూరు మండలం గోళ్లవారిపల్లెకు చెందిన గోళ్ల రమేశ్ (35), అతని భార్య అనూష (30), పిల్లలు శశాంక్ (12), మాన్యత (10) సజీవ దహనమయ్యారు. గోళ్ల రమేశ్ కుటుంబం బెంగళూరులో నివాసం వుంటోంది. ఇటీవల హైదరాబాద్‌కు వెళ్లారు. తిరిగి బెంగళూరుకు వెళ్లే ప్రయత్నంలో ప్రాణాలు కోల్పోవడం వారి కుటుంబ సభ్యుల్ని, మిత్రుల్ని తీవ్ర ఆవేదనకు గురిచేస్తోంది. ఇదే బస్సులో రమేశ్ స్నేహితుడు కూడా కుటుంబ సభ్యులతో కలిసి బెంగళూరు బయల్దేరారు. అయితే బస్సు అద్దాల్ని ధ్వంసం చేసి వాళ్లంతా అతికష్టం మీద ప్రాణాలతో బయటపడ్డారు. స్నేహితుడి కుటుంబమంతా సజీవ దహనం కావడంపై వారు కన్నీటిపర్యంతమయ్యారు. చివరికి కుటుంబ సభ్యులు కూడా గుర్తు పట్టలేనంతగా రమేశ్ దంపతులు, వారి ఇద్దరు పిల్లలు కాలిపోయారు. డీఎన్‌ఏ పరీక్షల్ని చూసి, వారి మాంసపు ముద్దల్ని అందించాల్సిన దయనీయ స్థితి కన్నీళ్లు తెప్పిస్తోంది. ఇంకా ఎంతో జీవితం ఉన్న నాలుగు ప్రాణాలు, అగ్నికి అహుతి కావడం మనసుల్ని కలచివేస్తోంది. ఈ తీవ్ర విషాదం వెనుక, ట్రావెల్ బస్సుల నిర్వహణలో ఉన్న లోపాలు చర్చకు వచ్చాయి. ప్రమాదానికి గురైన బస్సుపై తెలంగాణలో రూ. 23 వేల వరకు ఓవర్‌స్పీడ్ చలాన్లు ఉన్నట్లు వెల్లడైంది. నిబంధనలు పాటించకుండా మితిమీరిన వేగంతో ప్రయాణించడం, ఒడిశా పర్మిట్‌తో మూడు రాష్ట్రాల్లో బస్సును నడపడం వంటి షాకింగ్ విషయాలు వెలుగులోకి వచ్చాయి. డ్రైవర్ల నిర్లక్ష్యం ప్రభుత్వ పర్యవేక్షణ లేకపోవడం కారణంగానే ఈ నిండు జీవితాలు బలయినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ ఘటనలో తప్పు ఎవరిదైనా కావచ్చు, కానీ తిరిగి రానివి ఆ అమాయక ప్రాణాలు. విధి రాసిన రాతను ఎవరూ మార్చలేము. నిండు జీవితాలు ఆ మృత్యు జ్వాలల్లో కలిసిపోవడం ప్రతి మనిషి గుండెను కదిలించే కన్నీటి గాథ. బస్సు ప్రమాదం జరిగిన చోటుకు గద్వాల జిల్లా కలెక్టర్ సంతోష్, ఎస్పీ చేరుకున్నారు. 'బస్సులో 13 మంది తెలంగాణవాసులు ప్రయాణించినట్లు తెలుస్తోంది.





# జూబ్లీహిల్స్ బరిలో 58 మంది అభ్యర్థులు

(మొదటిపేజీ తరువాయి)

చేసిన మాగంటి గోపీనాథ్ గెలుపొంది వరుసగా మూడోసారి అసెంబ్లీలో అడుగుపెట్టారు. ఆయన మరణించడంతో ఉపఎన్నిక అనివార్యమయింది. ఫార్మాసిటీ, ట్రిపుల్‌ఆర్ బాధితులు, నిరుద్యోగులతోపాటు వివిధ వర్గాలకు చెందిన వారు నిరసన రూపంలో నామినేషన్లు దాఖలు చేసి పోటీలో ఉన్నారు. వారు తాము కాంగ్రెస్ ను ఓడించడమే లక్ష్యంగా పోటీ చేస్తున్నామని ప్రకటించారు.బీఆర్ఎస్ పార్టీ సిట్టింగ్ స్థానాన్ని కాపాడుకోవాలని బీఆర్ఎస్ విశ్వప్రయత్నాలు చేస్తోంది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచార బాధ్యతలని మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, పలువురు కీలక నేతలకు అప్పగించారు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్. ఎన్నికల ప్రచారాన్ని మరింత ఉధృతం చేయనుంది టీబీజేపీ. కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డితో పాటు బండి సంజయ్ కుమార్, బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు ప్రచారం చేయనున్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక బీజేపీ ప్రచారానికి ఉత్తరప్రదేశ్ , గోవా రాష్ట్రాల సీఎంలు కూడా హాజరయ్యే అవకాశాలు ఉన్నాయి. కాంగ్రెస్ తరపున సీఎం రేవంత్ రెడ్డి రోడ్ షోలను నిర్వహించే అవకాశం ఉంది.

# ఆలోచించండి.. ఆశీర్వదించండి

- నందివనపర్తి సర్పంచ్ బరిలో ఉన్నాను
- గ్రామ అభివృద్దే ధ్యేయంగా పార్టీలకు అతీతంగా బరిలో
- మీడియా సమావేశంలో మాట్లాడిన సర్పంచ్ అభ్యర్థి గోరటి వెంకటేష్



**ఇబ్రహీంపట్నం, విశాలభారతి:**

గ్రామ అభివృద్దే ధ్యేయంగా పార్టీలకు అతీతంగా గ్రామాన్ని అభివృద్ధి చేసి , ఆదర్శవంతమైన గ్రామంగా తీర్చిదిద్దడమే ముందున్న లక్ష్యం అని రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్ గా తాను బరిలో ఉన్నట్లు యాచారం మండలంలోని నందివనపర్తి గ్రామస్థుడు గోరటి వెంకటేష్ తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం అయన యాచారంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ లో భాగంగా నందివనపర్తి సర్పంచ్ రిజర్వేషన్ ఎస్సీ రావడంతో ఎన్నికల బరిలో నిల్చోవాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. తనకు సర్పంచ్ గా అవకాశం ఇస్తే గ్రామంలో ప్రాథమిక విద్య చదువుతున్న విద్యార్థుల నుంచే చదువుపై ఆసక్తి పెరిగేలా, నైపుణ్యాన్ని పెంచుకునే విధంగా కంప్యూటర్ విద్యను ప్రోత్సహిస్తానని తెలిపారు. గ్రామాల్లోని ప్రతి కమ్యూనిటీ భవనాల్లో కంప్యూటర్లు అందించి, గ్రామంలోని విద్యావంతులైన విద్యార్థులచే శిక్షణ తరగతులు ఏర్పాటు చేసి విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణ అందిస్తామని, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని, విద్యార్థులు, యువతలో ఉన్న ప్రతిభను వెలికితీసీ ప్రతి ఒక్క కళ కు రూపుదిద్దెలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. విద్యార్థులకు సాయంత్రం ట్యూషన్, గ్రామ లైబ్రరీ, క్రీడా సామాగ్రితో సమకూరిన ఇండోర్ , ఔట్ డోర్ క్రీడలకు ప్రాధాన్యతనిస్తూ టోర్నమెంట్లు నిర్వహించి క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీస్తానని అన్నారు. అన్ని రంగాల్లో గ్రామాన్ని ముందుకు తీసుకెళ్లడం లక్ష్యంగా పనిచేస్తానని నందివనపర్తి గ్రామ ప్రజలు తనను ఆశీర్వదించాలని గోరటి వెంకటేశం కోరారు.

# కాలువలు కప్పేస్తారు.. దారులు మూసేస్తారు

- కాలువలపై నిర్మాణాలు పట్టించుకోని అధికారులు
- ఎఫ్టిఎల్ , బఫర్ జోన్లలో ఇష్టారీతిలో నిర్మాణాలు
- నిర్మాణదారులకు తూతూ మంత్రంగా నోటీసులు జారీ
- కాల్వపైన నిర్మించే భవనానికి మున్సిపాలిటీ అనుమతులు ఎలా వచ్చాయి ?
- కాలువలు కబ్జాలు చేస్తే , భవిష్యత్ తరాలకు నీటి వనరులు అందడం ఎలా



**ఇబ్రహీంపట్నం, విశాలభారతి:**

ప్రస్తుతం హైదరాబాద్ లో హైడ్రా కూల్చివేతలు జోరుగా కొనసాగుతున్నాయి. అక్రమ నిర్మాణాల పై ఉక్కు పాదం మోపి ఆక్రమణదారుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తుంది ఈ హైడ్రా. హైదరాబాద్ కు మాత్రమే పరిమితం చేయొద్దంటూ డిమాండ్ కూగా గట్టిగానే వినిపిస్తుంది. ఎందుకంటే ఒక్క హైదరాబాద్ లోనే కాదు భూమికి డిమాండ్ ఉన్న ప్రతిచోట చెరువులు, కుంటలు, కాలువలు కబ్జాకు గురికాబడ్డవి. ముఖ్యంగా హైదరాబాద్ కు కూతవేటు దూరంలో ఉన్న అబ్దుల్లాపూర్ మెట్ మండలంలోని తుర్కయంజల్ మున్సిపాలిటీలోని మునగనూరు గొలుసుకట్టు చెరువుల్లో భాగంగా నిజాం ప్రభుత్వం తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని ఇంజాపూర్ దిలావర్ఖాన్ చెరువు నుంచి మునగ నూర్ మీదుగా పెద్దఅంబర్పేట్ ఈదులచెరువు వరకు 33 ఫీట్ల కాల్వను ఏర్పాటు చేసింది. ఇటీవల కాల్వ అభివృద్ధి కోసం నిధులు కూడా కేటాయించారు. ఇదిలా ఉండగా మునగనూర్ బలహీనవర్గాల కాలనీ వెనుక రొట్టెలోని గుట్ట కిందనుంచి ఉన్న కాల్వను స్థానికుల సహకారంతో కొందరు బిల్డర్లు ఆక్రమించారు. కాల్వపైనే భవన నిర్మాణాలు చేపడుతున్నారు. స్థానికులు అబ్దుల్లాపూర్మెట్ మండల రెవెన్యూ అధికారులకు, ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో వారు పనులు ఆపాలన్నా ఆపకుండా కాల్వపైనే భవన నిర్మాణాలు చకచక జరుగుతున్నాయి. పై స్థాయి అధికారులు కాల్వ ఆక్రమణ జరగకుండా చూడాలని రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులను ఆదేశించినట్లు తెలిసింది. గతంలో లక్షలు ఖర్చు చేసి కాల్వను అభివృద్ధి చేశారు. ఇటీవలే కాల్వ ఆక్రమణకు గురవుతుందని స్థానికులు వాపోతున్నారు. మునగనూర్ మధ్యలో నుంచి ఉన్న దాదాపు రెండు కిలోమీటర్ల కాల్వ అడుగడుగునా కబ్జాకు గురవుతుంది. అధికారులు స్పందించకుంటే మరికొన్ని రోజుల్లో భవన నిర్మాణాలే పూర్తి అయ్యే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైన జిల్లా అధికారులు స్పందించి కాల్వను కాపాడాలని గ్రామస్థులు కోరుతున్నారు. రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్ అధికారులు జాయింట్ సర్వే చేసి కాలువ నిర్మాణం చేపట్టి నిధులు కూడా మంజూరు చేశారు. కాల్వ పైన నిర్మించే భవనానికి మున్సిపాలిటీ అనుమతులు ఎలా వచ్చాయి. విద్యుత్ మీటర్ ఎలా వచ్చిందో అధికారులు చెప్పాల్సి ఉంది.



**వర్షా లు కురిస్తే పరిస్థితి ఎంటీ ?**

భారీ వర్షాలు కురిస్తే కాలువలపై నిర్మాణాలు చేపడుతున్న మునగనూరు పరిస్థితి ఏంటని గ్రామస్తులు వాపోతున్నారు. కాలువల ద్వారా వర్షపు నీరు మునగనూరు నుండి పెద్దఅంబర్పేట్ ఈదులచెరువు వరకు వెళ్లాలి. కానీ కబ్జా కావడం వల్ల నీరు ఎక్కడికక్కడ నిలిచి ఇండ్లన్ని మునిగిపోయే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించి కాలువపై నిర్మించిన అక్రమ నిర్మాణాలను తొలగించి కాలువలను కాపాడాలని అభ్యర్థిస్తున్నారు. ఈ అక్రమ నిర్మాణాల వెనుక ఉన్నదెవరు అని ప్రశ్నిస్తున్నారు.

# ఫుట్ఓవర్ బ్రిడ్జ్ సమీపంలో భిక్షాటకుడి మృతి

**సైబర్ పెరల్ బస్స్టాప్ వద్ద ఘటన**

**శేరిలింగంపల్లి,విశాలభారతి:**

సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని మాదాపూర్ పోలీస్ స్టేషన్ లిమిట్స్లో విషాద ఘటన చోటుచేసుకుంది. సైబర్ పెరల్ బస్స్టాప్ పక్కన గల ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ సమీపంలో వ్యక్తి మృతదేహం కనిపించింది. సమాచారం అందుకున్న మాదాపూర్ పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. మృతుడిని వెంకటసుబ్బారెడ్డి (54), తండ్రి నారాయణరెడ్డి, చిత్తూరు జిల్లా వాసిగా గుర్తించారు. కొన్ని రోజులుగా మాదాపూర్ పరిసర ప్రాంతాల్లో భిక్షాటన చేస్తూ, రాత్రివేళల్లో సైబర్ పెరల్ బస్స్టాప్ వద్దే నిద్రించేవాడని పోలీసులు తెలిపారు. అనారోగ్య సమస్యలతో మృతిచెందినట్టు ప్రాథమిక విచారణలో తేలిందని అధికారులు పేర్కొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు, కేసు నమోదు చేసుకున్న మాదాపూర్ పోలీసులు మరణానికి గల కారణాలపై ఆరా తీస్తున్నారు.



# రైతే రాజు, రైతే దేశానికి వెన్నుముక



**ఏఎంసీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య**
**వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి**

**చౌటుప్పల్, విశాలభారతి:**


పట్టణ కేంద్రంలోని లయన్స్ క్లబ్ ఆఫ్ చౌటుప్పల సేవ ఆధ్వర్యంలో శుక్రవారం రోజున స్థానిక వ్యవసాయ మార్కెట్ నందు రైతు సోదరులకు లయన్స్ క్లబ్ సభ్యులు కామిశెట్టి చంద్రశేఖర్ అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య విచ్చేసి అన్నదాన కార్యక్రమంలో ప్రారంభించడం జరిగింది.అనంతరం వారు మాట్లాడుతూ,రైతే రాజు,రైతే దేశానికి వెన్నుముక అని అన్నారు.రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని,రైతు పండించిన ప్రతి గింజను కొనే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటుందని అన్నారు.రైతును రాజుగా మార్చే ప్రణాళికలు ప్రజా ప్రభుత్వంలో తయారు చేస్తున్నామని అన్నారు.ప్రజలందరికీ అన్నం పెట్టే రైతులకు,భోజనం పెట్టి ఆకలి తీర్చిన లైన్స్ క్లబ్ ఆఫ్ చౌటుప్పల సేవ వారిని అభినందించారు.ఈ కార్యక్రమంలో మునుగోడు ఎన్నికల సమన్వయకర్త పబ్బు రాజు గౌడ్,లయన్స్ క్లబ్ ఆఫ్ చౌటుప్పల్ సేవ అధ్యక్షులు తిరందాస్ జగన్నాథ్,లయన్స్ క్లబ్ ఆఫ్ చౌటుప్పల్ సేవ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ దాచేపల్లి ప్రకాష్ గుప్తా,నాయకులు,లయన్స్ క్లబ్ సభ్యులు,ఎండి అతహర్ పాషా,సిలువేరు మంగయ్య,మోగుదాల రమేష్, నాంపల్లి రమేష్,దేవరపల్లి గోవర్ధన్ రెడ్డి,కామిశెట్టి భాస్కర్,దాచేపల్లి శ్రీనివాస్ గుప్తా,చింతల తిరుమలరెడ్డి,చింతల ప్రభాకర్ రెడ్డి మరియు రైతు సంఘాల నాయకులు,వ్యవసాయ మార్కెట్ కమిటీ సభ్యులు,రైతులు పాల్గొన్నారు.

# ఈఎల్వి భాస్కర్ ఫౌండేషన్ పెద్ద మనసు

**విద్యార్థులకు ఆర్థిక సహాయం**

**చౌటుప్పల్, విశాలభారతి:**

మండలంలోని పీపల్ పహాడ్ గ్రామం నిరుపేద కుటుంబానికి చెందిన ఎర్ర మధుశ్రీ,మర్రిగూడం మండల కేంద్రానికి చెందిన ఈద గిరి,కొండ మల్లేపల్లి మండలం ఎస్సి కాలనీ కి చెందిన అందుగుల తేజశ్రీ, అందుగుల ప్రవల్లిక లు ఎంబిబిఎస్ లో ర్యాంకులు సాధించి ఆర్థిక ఇబ్బందులతో పై చదువులకు ఆటంకం ఏర్పడింది.ఈ విషయాన్ని తెలుసుకున్న ఈ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ భాస్కర్ సూచన మేరకు డైరెక్టర్ అశోక్, చేతులమీదుగా ఒక్కొక్కరికి 50,000 యాభై వేల రూపాయల చొప్పున మొత్తం లక్షా యాభై వేల రూపాయలు ఆర్థిక సహాయంగా అందించారు.తదనంతరం వారు మాట్లాడుతూ మునుముందు వారి ఎంబిబిఎస్ చదువుకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని మాట ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఈ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ సభ్యులు,గ్రామస్తులు,అభిమానులు, పాల్గొన్నారు.





# సిగరేట్ తాగి వస్తానన్న వృద్ధుడు మిస్సింగ్

**కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న మల్కాజిగిరి పోలీసులు**

మల్కాజిగిరి, విశాలభారతి, సిగరెట్ తాగి వస్తానన్న వృద్ధుడు కనిపించకుండాపోయిన ఘటన మల్కాజిగిరి పోలిస్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. మౌలాలి, ఎస్.పి నగర్ లో నివసించె అబ్దుల్ అలీమ్ (64) అనే వృద్ధుడు ఆటో డ్రైవర్. శుక్రవారం మధ్యాహ్నం 2:30 గంటల ప్రాంతంలో సిగరెట్ తాగడానికి వెళ్లి తిరిగి రాలేదు. సాయంత్రం అయినా అతను ఇంటికి చేరుకోకపోవడంతొ అతని భార్య షేక్ షాహిదా బేగం తెలిసిన పరిసర ప్రాంతాలన్నీ వెతికి, బంధుమిత్రులను ఆరా తీసింది. అయినా అతని ఆచూకి తెలియకపోవడంతొ సాయంత్రం 8:30 గంటలకు తన భర్త కనిపించడం లేదని పోలీసులకు కంప్లైంట్ చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్.ఐ శ్రీనివాస్ తెలిపారు.



# ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన కుంభం



**మునుగోడు, విశాలభారతి:**

కష్టపడి పండించిన పంటను కొనుగోలు కేంద్రంలోనే అమ్మాలని నల్లగొండ జిల్లా డిసిసిబి చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి అన్నారు మండలంలోని కచలాపురం, ఊకోండి ,ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం నల్లగొండ జిల్లా డిసిసిబి చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించినారు .ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు కొనుగోలు కేంద్రాలలో దాన్యం అమ్ముకొవాలని దళారులకు అమ్ముకొని మోసపోవద్దు అని అన్నారు. అకాల వర్షానికి ధాన్యము తడవ కుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు అలాగే రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చే దాన్యం తేమ శాతం 17% ఉండే విధంగా తాలు,మట్టి,పెళ్లా లేకుండా శుభ్రంగా ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలకు తీసుకు రావాలని సూచించారు. ప్రభుత్వమిచ్చే మద్దతు ధర గ్రేడ్ " ఏ " 2389 రూపాయలు సాధారణ 2369 రూపాయలు మరియు సన్న వరి ధాన్యానికి 500 రూపాలు బోనస్ అందిస్తుందని ఇట్టి అవకాశాన్ని రైతులు వినియెగించుకోవాలని తెలిపారు. రైతులు నిబంధనలను పాటించి ధాన్యాన్ని విక్రయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చండూర్ మార్కెట్ చైర్మన్ దోటి నారాయణ, మార్కెట్ డైరెక్ట్ కుంభం చెన్న రెడ్డి హైమదు, అగ్రికల్చర్ ఏవో పద్మజ, సంఘ డైరెక్టర్లు ఉప్పునుతుల రమేష్, మార్తా మోహన్ రెడ్డి, మేకల మల్లయ్య, సింగం వెంకన్న, జిట్టగోని యాదయ్య, ఏఈఓ నికిల్, పిఎసిఎస్ సీఈవో సుఖేందర్, అశోక్ రెడ్డి, పురుషోత్తం, స్వామీనాథ్ లింగస్వామి, చంద్రశేఖర్ ప్రజా ప్రతినిధులు భీమనపల్లి సైదులు, జాల వెంకటేశ్వర్లు, గురుజ రామచంద్రం, కొండకింది రామ్ రెడ్డి, మేడి యాదయ్య, నడిపల్లి యాదగిరి, మాదగోని దేవలోకం, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర అస్తిత్వాన్ని తాకట్టుపెట్టే విధంగా కాంగ్రెస్ పాలన

- జూబ్లీహిల్స్ లో మాగంటి సునీత గెలుపు ఖాయం
- తుమ్మల నాగరాజు రెడ్డి బిఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షులు

**చిట్యాల, విశాలభారతి:**



తెలంగాణలో కాంగ్రెస్ పరిపాలన రోజు రోజుకి దిగజారుతుందనడానికి తెలంగాణ మంత్రి వర్గంలో జరుగుతున్న పోరే అందుకు నిదర్శనం, పాలన గాలికి వదిలేసి పంతానికి పోవడం.అసలు ఆరు గ్యారెంటీల ఊసే మర్చిపోవడం,ఆఖరికి కాంగ్రెస్ పాలనలో తెలంగాణ రాష్ట్ర అస్తిత్వాన్ని తాకట్టు పెట్టే విధంగా పరిపాలన ఉన్నందున, రేపు జరగబోయే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో మాగంటి సునీత గోపీనాథ్ గెలుపు ఖాయమని చిట్యాల మండలం యువజన విభాగ అధ్యక్షులు తుమ్మల నాగరాజు రెడ్డి అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం వివ్యరిస్తున్న తీరుకు రాష్ట్ర ప్రజలంతా వ్యతిరేకంగా ఉన్నారని ఎన్నికలు ఏవైనా సరే గెలిచేది బీఆర్ఎస్ అభ్యర్థులేనని,తెలంగాణ సమాజం అంతా బిఆర్ఎస్ వైపే ఉన్నారని తెలిపారు.బిఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత గోపీనాథ్ భారీ మెజార్టీతో గెలవడం ఖాయం అన్నారు.రాష్ట్రంలో అన్ని సామాజిక వర్గాలకు న్యాయం జరిగేలా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రారంభించి అడుగు బలహీన వర్గాలకు అండగా నిలిచిన ఏకైక ప్రభుత్వ కేసీఆర్ హయాంలో నీ బిఆర్ఎస్ ప్రభుత్వం మాత్రమే అని అన్నారు.చేతకాని కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు విసిగిపోయారని ఇకనుంచి ఫార్మాట్ ఏదైనా ప్రతి ఎన్నికల్లో విజయం సాధించేది బిఆర్ఎస్ పార్టీనే అని ఆయన ఒక ప్రకటనలో దీమా వ్యక్తి చేశారు.

# సీసీ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభం

**పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:**

హయత్నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి మధురానగర్ కాలనీలో నూతన సీసీ రోడ్ల నిర్మాణ పనులను శుక్రవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా కాలనీవాసులతో కలిసి ప్రాంతాన్ని సందర్శించిన కార్పొరేటర్ , కాలనీలో మిగిలి ఉన్న వీధుల్లో కూడా సీసీ రోడ్లను పనులు పూర్తి చేయాలి అని కాలనీ సభ్యులు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ..మధురానగర్ కాలనీలో ఇప్పటివరకు కొన్ని వీధుల్లో మాత్రమే రోడ్లు పూర్తయ్యాయి. మిగిలిన వీధుల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి అవసరమైన నిధులు ఇప్పటికే మంజూరయ్యాయి. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వల్ల కొంత ఆలస్యం జరిగినప్పటికీ, త్వరలోనే అన్ని పనులు పూర్తి అవుతాయి అని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు అమల్ నాయక్, సంక్షేమ సంఘం సభ్యులు నరేష్, కృష్ణమూర్తి, యాదగిరి, మహేష్ సూర్య, శంకర్, నిర్మల, రాజు, కిరణ్, రవీందర్ తదితర కాలనీవాసులు పాల్గొన్నారు.





# రైతు కష్టం వర్షా ర్పణం


**ఆర్మూర్, విశాలభారతి:**

ఆరుగాలం కష్టపడి పండించిన వరి ధాన్యం వర్షానికి తడిసి ముద్దయింది. శుక్రవారం ఆర్మూర్ నియోజకవర్గంలో సాయంత్రం కురిసిన అకాల వర్షానికి వరి ధాన్యం కుప్పలను టార్పాన్ పత్రాలతో రైతులు వర్షం తో తడవకుండా కప్పారు. ఖరీఫ్ లో సన్న రకం వరి సాగు చేసి సరైన దిగుబడి రాక దిగులు చెందుతున్న తరుణంలో ఇలా ఆకస్మికంగా వర్షాలు కురవడంతో రైతన్నలకు కంటిమీద కునుకులేకుండా చేస్తోంది. రెండు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని వాతావరణ శాఖ తెలపడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

# ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ల ప్రారంభం

**రాజేంద్రనగర్, విశాలభారతి :**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్యాంటీన్లను ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ప్రారంభించారు.ఆరంఘర్ బస్ స్టాప్, కాటేదాన్ సిటిజన్ కంటా వద్ద వాటిని ప్రారంభించారు. ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ ఈ క్యాంటీన్లలో ప్రతిరోజూ ఉదయం అల్పాహారము అందించబడుతుందని ఈ క్యాంటీన్లు హరే రామ హరే కృష్ణ ట్రస్ట్ వారి సహకారంతో నిర్వహించబడుతున్నాయన్నారు. మహిళా స్వయం సహాయక బృందాలకు ఉపాధి కల్పించడంలో మరియు ప్రజలకు తక్కువ ధరలో ఆహారం అందించడంలో ఈ క్యాంటీన్లు కీలకపాత్ర పోషించనున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రెసిడెంట్ మరియు పార్టీ సీనియర్ నాయకులు ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



## తెలంగాణ ఏర్పడినాక ఎస్సీ, ఎస్టీ, బీసీలే నష్టపోయారు

**టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మధుయాష్కిగౌడ్**

**ఎల్ బి నగర్, విశాలభారతి:**

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లును 9వ షెడ్యూల్లో చేర్చాలని డిమాండ్ చేస్తూ బీసీ రిజర్వేషన్ల సాధన సమితి ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద ఏర్పాటు చేసిన మహా ధర్నా కార్యక్రమానికి టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మధుయాష్కిగౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మధుయాష్కీ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత అత్యధికంగా నష్టపోయింది ఎస్సీ, ఎస్టీ, బీసీ బిడ్డలేనన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం పార్టీలే ఇప్పుడు దిగి వచ్చాయని.. కానీ వాటిని సాధించుకునేందుకు, చట్టం చేసి 9వ షెడ్యూల్లో పెట్టేందుకు ప్రజా ఉద్యమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రం కోసం పోరాడుతున్న సమయంలో సామాజిక తెలంగాణ అంశం ఎవరం పట్టించుకోలేదని, కానీ ఇప్పుడు సామాజిక తెలంగాణ కోసం పోరాడాల్సిందేనని పేర్కొన్నారు.






## పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభించిన జిల్లా కలెక్టర్

**మునుగోడు, విశాలభారతి:**

మండల కేంద్రంలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో బాలాజీ కాటన్ ఇండస్ట్రీస్ లో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని డిసిసిబి చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా అధికారులు,మిల్లర్లతో ముఖాముఖి మాట్లాడారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది కలిగించకుండా పత్తిని కొనుగోలు చేయాలని చెప్పారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, డిసిసిబి చైర్మన్లు పత్తి తేమ శాతాన్ని పరిశీలించారు. అంతేకాక తూకం యంత్రం ద్వారా తూకాన్ని పరీక్షించారు .తేమ 8 నుండి 12 శాతం లోపు ఉండేవిధంగా కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని కలెక్టర్ రైతులకు చెప్పారు.అనంతరం జిల్లా కలెక్టర్ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ మునుగోడు పత్తి కొనుగోలు కేంద్రం అతి ముఖ్యమైందని,ఎల్ 1 సెంటర్ గా ఉన్న ఈ కేంద్రంలో గతంలో రైతులు ఇతర జిల్లాల నుండి పత్తిని తీసుకు వచ్చే వారని, అప్పుడు జిల్లా రైతులు పత్తిని అమ్మడంలో ఇబ్బందులు ఎదుర్కొన్నారని ,ఈ సంవత్సరం కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కొత్తగా కపాస్ కిసాన్ యాప్ ను ఏర్పాటు చేసిందని, ఈ యాప్ ద్వారా ముందుగా స్లాట్ బుక్ చేసుకున్న రైతుల పత్తి సరైన తేమ శాతంతో ,నాణ్యతా ప్రమాణాలతో ఉంటే అదేరోజు కొనుగోలు చేయడం జరుగుతుందని ఆమె తెలిపారు. ఒక సీజన్లో రైతు మూడు సార్లు స్లాట్ బుక్ చేసుకోవచ్చని, ఒకవేళ ఏదైనా కారణం చేత బుక్ చేసుకున్న స్లాట్ ను క్యాన్సల్ చేసుకోవచ్చని ,ఆ స్లాట్ అలాగే ఉంటుందని స్పష్టం చేశారు. మునుగోడు కేంద్రంలో 19000 మెట్రిక్ టన్నుల పత్తిని కొనుగోలు చేసే సామర్థ్యం ఉన్నందున చుట్టుపక్కల రైతులకు పత్తి అమ్మకంలో ఎలాంటి ఇబ్బందులేదని చెప్పారు. ఈ రెండు మూడు రోజులు రైతులెవరు స్లాట్ ను బుక్ చేసుకోవద్దని, వర్షాలు తగ్గిన తర్వాత స్లాట్ బుక్ చేసుకోవాలని,పత్తిని బాగా ఆరబెట్టి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్,ఆర్డీఓ శ్రీదేవి ఎంపిడిఓ నరేందర్,ఇంచార్జ్ తహశీల్దార్ నరేష్, చండూర్ మార్కెట్ చైర్మన్ దోటి నారాయణ ఏవో పద్మజ, ఏఈఓ నరసింహ గౌడ్,మౌనిక,జిల్లా అగ్రికల్చర్ అధికారులు, సి సి ఐ అధికారులు సిబ్బంది,మార్కెట్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## విద్యార్థుల కోసం సైబరాబాద్ పోలీస్ ఓపెన్ హౌస్

- పోలీసు విధులపై ప్రత్యక్ష అవగాహన
- పేలుడు పదార్థాల నిర్వీర్యంపై ప్రదర్శన

**శేరిలింగంపల్లి, విశాలభారతి:**

పోలీసు స్మారక వారోత్సవాలలో భాగంగా విద్యార్థుల్లో చట్టపరమైన అవగాహన పెంచేందుకు సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో శుక్రవారం ఓపెన్ హౌస్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సైబరాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగిన ఈ కార్యక్రమాన్ని మహిళా బాలల భద్రతా విభాగం డీసీపీ సృజన కర్ణం ప్రారంభించారు.విద్యార్థులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ పోలీసులు కేవలం నేరస్థులను పట్టుకోవడానికే కాదు, సమాజంలో శాంతి భద్రతలు, చట్టపరమైన అవగాహన పెంపు కోసం నిరంతరం కృషి చేస్తున్నారు. ప్రతి విద్యార్థి పోలీస్ వ్యవస్థ ఎలా పనిచేస్తుందో, సమాజంలో భద్రత ఎలా సాధ్యమవుతుందో తెలుసుకోవాలని సూచించారు. సైబరాబాద్ పరిధిలోని ఐదు జోన్లకు చెందిన సన్‌షైన్ గ్లోబల్ స్కూల్, ఇండియన్ పీపుల్ స్కూల్, శ్రీ గౌతమ్ హై స్కూల్‌తో పాటు పలు విద్యా సంస్థల నుండి సుమారు 550 మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.విద్యార్థుల కోసం ప్రత్యేక ప్రదర్శనలు కూడా నిర్వహించారు. బాంబ్ డిస్పోజల్ టీమ్ పేలుడు పదార్థాల గుర్తింపు,నిర్వీర్య పరికరాలు,బాంబ్ సూట్, బాంబ్ బ్లాంకెట్, వాహన తనిఖీ అద్దం, మెటల్ డిటెక్టర్లు, సాధనాలు వివరంగా చూపించారు. స్నిఫర్ డాగ్స్ తమ ప్రతిభతో ఆకట్టుకోగా, విద్యార్థులు ఆసక్తిగా వీక్షించారు. ఇక మౌంటెడ్ పోలీస్ విభాగం గుర్రపు స్వారీతో ఆకట్టుకోగా, సైబరాబాద్ స్పెషల్ పార్టీ చేసిన సైలెంట్ డ్రిల్, బ్యాండ్ డ్రిల్ విద్యార్థులను ఉత్సాహపరిచాయి. పోలీస్ జీవితం,క్రమశిక్షణ, కఠిన శిక్షణ పట్ల విద్యార్థులు ప్రత్యక్ష అనుభవం పొందారు.ఈ కార్యక్రమంలో సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్ ఏడీసీపీ షమీర్,ఏసీపీ అరుణ్‌కుమార్,డబ్ల్యూఅండ్‌సీఎస్డబ్ల్యూ ఇన్‌స్పెక్టర్ యడయ్య, ఏహెచ్‌టీయూ ఇన్‌స్పెక్టర్ జేమ్స్‌బాబు,ఆర్టీఓలు ప్రశాంత్‌బాబు, వీరలింగం, నాగరాజు రెడ్డి, హిమాకర్, నాగరాజు, జంగయ్య తదితర అధికారులు పాల్గొన్నారు.విద్యార్థుల్లో చట్టపరమైన అవగాహన పెంపు, పోలీస్ వ్యవస్థపై సానుకూల దృక్పథం కలిగించే లక్ష్యంతో సైబరాబాద్ పోలీస్ చేపట్టిన ఈ ఓపెన్ హౌస్ విద్యార్థులను ఉత్సాహపరిచింది.





## ప్రజల గుండెల్లో స్థానం సంపాదించిన సేవామూర్తి

**మాజీ సర్పంచ్ గుగులోత్ రాంలాల్ నాయక్**

**కురవి, విశాలభారతి:**

లింగ్యా తండా (బి) మనుషుల మధ్య మనుష్యత్వం క్రమంగా తగ్గిపోతున్న ఈ కాలంలో కూడా మంచితనానికి మారుపేరుగా నిలిచిన మాజీ సర్పంచ్ గుగులోత్ రాంలాల్ నాయక్, ప్రజల మనసుల్లో చెరగని ముద్ర వేశారు. ఆయన సర్పంచ్‌గా ఉన్నప్పుడు మాత్రమే కాదు, ఇప్పటికీ సేవా పథంలో అడుగులు వేస్తూనే ఉన్నారు. అధికారంలో ఉన్నా లేకున్నా ప్రజలతో మమేకమై, వారి కష్ట సుఖాల్లో భాగస్వామిగా ఉండటం ఆయన జీవిత ధ్యేయం. గ్రామంలోని ప్రతి ఇంటిని తలుపుతట్టి వారి ఆపదలో ముందుండే రాంలాల్ నాయక్, "అన్నా" అని పిలిచిన వారందరికీ వెన్నుదన్నుగా నిలిచారు. తండాలో ఎవరైనా కష్టాల్లో ఉన్నారని తెలిసినా, ఒక ముద్ద అన్నం తినక ముందే వారి ఇంటికి వెళ్లి సాయం చేయడం ఆయన స్వభావం. సర్పంచ్‌గా ఉన్న సమయంలో కూడా "అధికార అహంకారం" అనే పదం ఆయన నిఘంటువులో లేదు. ప్రతి ఇంటికి పెద్దబిడ్డలా వ్యవహరించి ప్రజల సమస్యలను తనవిగా తీసుకుని పరిష్కరించారు. అభివృద్ధి కార్యక్రమాల పరంగా రాంలాల్ నాయక్, గ్రామానికి కొత్త ఊపు తెచ్చారు. రహదారులు, పేదలకు ఇళ్ల స్థలాలు, తాగునీటి సదుపాయాల కోసం కృషి చేశారు. పేద కుటుంబాల్లో మరణాలు జరిగినా, ఆ కుటుంబానికి అండగా నిలిచి చివరి సంస్కారాల్లో కూడా తోడుగా ఉంటూ మానవత్వానికి నిదర్శనమయ్యారు. "మా సర్పంచ్ కాదు, మా కుటుంబ సభ్యుడు" అని గ్రామస్తులు ప్రేమగా అంటారు. రాంలాల్ నాయక్ ప్రజలను కంటిపాపల్లా చూసుకునే నిజమైన ప్రజాప్రతినిధి అని ప్రతి ఒక్కరూ గర్వంగా చెప్పుకుంటున్నారు. ఆయన వంటి సేవామూర్తి మన గ్రామంలో ఉండటం ఆ దేవుడు ఇచ్చిన గొప్ప వరమని లింగ్యా తండా (బి) ప్రజలు ఆనందంగా తెలిపారు.



## మెడికల్ సీటు సాధించిన విద్యార్థులకు ఆర్థిక చేయూత

**తొర్రూరు, విశాలభారతి:**

సేవా నిరతిని చాటుకున్న లయన్స్ క్లబ్ ఆఫ్ తొర్రూరు అధ్యక్షులు లయన్ డాక్టర్ సూర్నం రామ నర్సయ్య ఆధ్వర్యంలో కాళోజి నారాయణ రావు ఆరోగ్య విశ్వవిద్యాలయంలో మెడికల్ సీటు సాధించిన ముగ్గురు విద్యార్థులకు శాలువలతో సన్మానం చేసి రూ.70 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా రామ నర్సయ్య మాట్లాడుతూ తొర్రూరు మండలానికి చెందిన ధర్మారపు లోకేష్,పి. సంజయ్,పెద్దవంగర మండలం పోచారం గ్రామానికి చెందిన పోగు ప్రణీత లకు ఒక్కొక్కరికి 20 వేలు, వారికి ఆప్రాన్స్ మరియు స్కెతస్కోపు లకు రూ.10 వేల రూపాయలను అందజేశారు.ఈ కార్యక్రమంలో పిడీజీ లు లయన్ డాక్టర్ కె. రాజేందర్ రెడ్డి,లయన్ తమ్మెర లక్ష్మీ నరసింహారావు, జిఎంటి కోఆర్డినేటర్ తుమ్మటి వెంకటరెడ్డి, కోలాబరేట్ గ్యాట్ డాక్టర్ పి.కిరణ్ కుమార్,డిస్ట్రిక్ట్ ఎవల్యూషన్ చైర్మన్ రేగురి వెంకన్న, ఆర్సి దామెర సరేస్, జెసి చిదిరాల నవీన్, పిఆర్సిలు డాక్టర్ యాదగిరి రెడ్డి, ఆర్ఎస్ టి. వెంకటేశ్వర్లు,క్లబ్ సెక్రటరీ లయన్ ముడుపు రవీందర్ రెడ్డి, ట్రెజరర్ వజినపల్లి శ్రీనివాస్, జాయింట్ సెక్రెటరీ బోనగిరి శంకర్, దేవేందర్ రెడ్డి, రమేష్, ప్రభాకర్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.







## ఖైదీల మార్పు కోసం సైకో థెరపీ ట్రైనింగ్

**జైళ్ల శాఖ ఉన్నతాధికారులు**

**చర్లపల్లి, విశాలభారతి:**

ఖైదీల మానసిక మార్పు, భావోద్వేగ వికాసం, స్వీయ అవగాహన కోసం రూపొందించిన సైకో థెరపీ ట్రైనింగ్ ఆఫ్ ట్రైనర్స్ (టీఓటి) కార్యక్రమం చర్లపల్లి సెంట్రల్జైలులో ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని డైరెక్టర్ జనరల్ ఆఫ్ప్రిజన్స్ కరెక్షనల్ సర్వీసెస్ డాక్టర్ సౌమ్యా మిశ్రా శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్రంలోని తొమ్మిది జైళ్ల నుండి ఎంపికైన 60 మంది ఖైదీలకు ఫిలిస్ క్రిస్టల్ వైద్య పద్ధతి అనే ప్రత్యేక మానసిక చికిత్సా విధానంపై శిక్షణ దోహదపడుతుందన్నారు. ఈ పద్ధతి ప్రసిద్ధ మనోవిజ్ఞానికార్ల్జంగ్సిద్ధాంతాల పైఆధారపడి, భావోద్వేగాలనియంత్రణ, అంతరాత్మశాంతి, మరియు వ్యక్తిగత పరివర్తననుసాధించేందుకు తోడ్పడు తుందన్నారు. ఈసందర్భంగ సౌమ్యమిశ్రా జైళ్ల శాఖ ఇప్పుడు కేవలం శిక్షావ్యవస్థ కాకుండా, సంస్కరణాత్మక, పునరావాస కేంద్రంగామారుతోందన్నారు. ప్రతి వ్యక్తికి మార్పు, అభివృద్ధి అవకాశాలు, ఖైదీలు భావోద్వేగపరంగా స్వస్థత పొందేందుకు, జీవన విధానాన్ని మార్చుకునేందుకు ఈకార్యక్రమం దోహదపడుతుందన్నారు. ఈకార్యక్రమానికి అతిథిగా అడిషనల్ జనరల్ ఆఫ్ స్టేట్ సీఐడీ, ఏసీబి చారుసిన్హా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జైళ్ల శాఖ సంబంధిత అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## వివిధ శుభ కార్యాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి

**పెద్ద అంబర్పేట్, విశాలభారతి:**

ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి శుక్రవారం రోజున నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాల్లో జరిగిన వివాహ శుభకార్యాలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..వివాహం మన జీవితంలో అత్యంత పవిత్రమైన బంధం, దంపతులు ప్రేమ, పరస్పర గౌరవంతో జీవితాన్ని సంతోషంగా గడపాలి అని ఆశీర్వచనాలు అందించారు. ఈ కార్యక్రమాల్లో గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి, అబ్దుల్లాపూర్మెట్ మండల మాజీ ఎంపీపీ బుర్ర మహేందర్ గౌడ్, బాటసింగారం మాజీ ఎంపీటీసీ కేశెట్టి వెంకటేష్, మండల పార్టీ నాయకులు గుండ్లపల్లి ధన్ రాజ్ గౌడ్, బుయ్య కృష్ణగౌడ్, కాకుమాను సునీల్, మాజీ కోఆప్షన్ నెంబర్ ఎం.డి. గౌస్ పాషా, బొక్క వంశీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కర్నూలు బస్సు ప్రమాదంలో మియాపూర్ వాసికి స్వల్ప గాయాలు

**శేరిలింగంపల్లి, విశాలభారతి:**

కర్నూలు జిల్లాలో జరిగిన ఘోర బస్సు ప్రమాదంలో మియాపూర్‌కు చెందిన యువకుడు తృటిలో ప్రాణాలతో బయటపడ్డాడు. మియాపూర్ మక్త మహబూబ్‌పేట్‌లోని ప్రజా షెల్టర్ అపార్ట్మెంట్‌లో నివసించే జయసూర్య (23) అనే యువకుడు ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలయ్యాడు. ప్రస్తుతం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కడప జిల్లా జమ్మలమడుగు మండలం నెమలి దిమ్మె గ్రామానికి చెందిన జయసూర్య తల్లిదండ్రులు సుబ్బారాయుడు, రమాదేవి దంపతులతో కలిసి మియాపూర్‌లో నివసిస్తున్నారు. మల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్ పూర్తి చేసిన జయసూర్య, బెంగళూరులో ఇంటర్వ్యూ ఉందంటూ గురువారం సాయంత్రం ఇంటి నుంచి బయల్దేరాడు. మియాపూర్‌లో బస్సు మిస్సవడంతో మూసాపేట వద్ద బస్సు ఎక్కిన అతను, ప్రమాదం జరిగిన సమయంలో అదే బస్సులో ఉన్నాడు. అయితే అదృష్టవశాత్తు ప్రాణాలతో బయటపడిన జయసూర్య, శుక్రవారం ఉదయం ఆరున్నర ప్రాంతంలో తల్లిదండ్రులకు కాల్ చేసి విషయం తెలిపాడు. "నాకు రెండు కాళ్లకు గాయాలు అయ్యాయి.. ప్రస్తుతం కర్నూలు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నా.. ఆరోగ్యం నిలకడగా ఉంది. ఆందోళన చెందవద్దు" అని తెలిపాడని ఆయన తల్లిదండ్రులు తెలిపారు. తమ కుమారుడు ప్రాణాలతో బయటపడటంతో కుటుంబ సభ్యులు, బంధువులు ఊపిరి పీల్చుకున్నారు.అతను ఎలా బయటపడ్డాడో ఫోన్‌లో వివరించాడు.




## వ్యవసాయ విశ్వ విద్యాలయంలో మరో 150 బీఎస్సీ అగ్రికల్చర్ సీట్లు

- కొత్త గా ఏర్పాటు కానున్న మూడు కళాశాలల్లో 90 సీట్లు
- బీసీ సంక్షేమ గురుకుల సొసైటీ సహకారం తో 60 సీట్లు
- ఉప కులపతి అల్దాస్ జానయ్య

**రాజేంద్రనగర్, విశాలభారతి:**

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలో ఈ ఏడాది నుంచి బీ ఎస్సీ (ఆనర్స్ ) అగ్రికల్చర్ కోర్సు లో మరో 150 సీట్లు అందుబాటులోకి రానున్నాయని ఉప కులపతి అల్దాస్ జానయ్య ప్రకటించారు. ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం పీజేటీఏ యూ కి మూడు నూతన వ్యవసాయ కళాశాలలని మంజూరు చేసిందని ఆయన తెలిపారు. హుజూర్ నగర్ లో ఏర్పాటు కానున్న కళాశాలలో 30 సీట్లు, కొడంగల్ లో రానున్న కళాశాలలో 30 సీట్లు, నిజామాబాద్ లో ఏర్పాటు కానున్న కళాశాలలో 30 సీట్లు అందుబాటులోకి రానున్నాయని జానయ్య వివరించారు. ఇప్పటికే ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకి ఈ సీట్ల భర్తీ కి త్వరలో ప్రత్యేకంగా కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు జానయ్య వివరించారు. మరోవైపు మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణా వెనుకబడిన తరగతుల సంక్షేమ రెసిడెన్షియల్ విద్యా సంస్థల సొసైటీ ఆర్థిక సహకారం తో టీజి EAPCET2025 లో అర్హత సాధించిన వెనుక బడిన తరగతుల విద్యార్థుల కి బి.యాస్సీ. అగ్రికల్చర్ లో మరో 60 సీట్ల ని ఈ విద్యా సంవత్సరం నుంచి అందుబాటులోకి తీసుకుని రానున్నట్లు జానయ్య పేర్కొన్నారు. ఈ 60 సీట్లని రాజేంద్ర నగర్, వరంగల్, జగిత్యాల, పాలెం, సిరిసిల్ల, అశ్వారావుపేట కళాశాలలలో ఒక్కో కళాశాలలో 10 సీట్లు చొప్పున భర్తీ చేయనున్నట్లు ఆయన వివరించారు. ఈ సీట్ల లో ప్రవేశాల కోసం ug.mjptbcwreis.net మరియు pjtau.edu.in వెబ్ సైట్ల లో మరలా ఈ నెల 29 వ తేది లోగా దరఖాస్తు చేసుకోవలసింది గా ఉప కులపతి అల్దాస్ జానయ్య సూచించారు.






## జర్నలిస్టును పరామర్శించిన మాజీ మంత్రి రెడ్యానాయక్

**కురవి, విశాలభారతి:**

కురవి మండలం తట్టుపల్లి గ్రామానికి చెందిన సీనియర్ పాత్రికేయుడు బేతమల్ల సహదేవ్ ఇటీవల జరిగిన ద్విచక్ర వాహన ప్రమాదంలో గాయపడ్డారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకునేందుకు డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి డి.ఎస్. రెడ్యానాయక్ శుక్రవారం తట్టుపల్లి గ్రామానికి ప్రత్యేకంగా విచ్చేసి సహదేవ్‌ను పరామర్శించారు. సహదేవ్ సేవలను గుర్తు చేసుకుంటూ రెడ్యానాయక్ మాట్లాడుతూ - "సత్యం, సమాజం కోసం కలం పట్టిన వ్యక్తి గాయపడడం బాధాకరం. ఆయన త్వరగా కోలుకోవాలని, మళ్లీ తన కలంతో ప్రజల సమస్యలను వెలుగులోకి తేవాలని కోరుకుంటున్నాను" అన్నారు. ఈ సందర్భంగా బి.ఆర్.ఎస్ జిల్లా నాయకులు బజ్జూరు పిచ్చి రెడ్డి, యువజన రాష్ట్ర నాయకులు గుగులోత్ రవి నాయక్, జర్నలిస్టు కొప్పుల శ్రీను, తట్టుపల్లి మాజీ సర్పంచ్ పోరెడ్డి రాంరెడ్డి, మాజీ ఎంపీటీసీ పోతుగంటి వెంకన్న, నాయకులు వంగాల ఆచారి, అంతటి సురేష్, కొత్త ప్రభాకర్, అంతటి యాలాద్రి, కోటోజు వీరచారి, యాసరపు మురళి, వంగాల వెంకటరమణ, మందుల శ్రీనివాస్, వెంపటి యాకుబ్ తదితరులు పాల్గొన్నారు.

### ఫీల్డ్ విజిట్ చేసిన డీఎల్‌పీఓ సాధన రెడ్డి

## ఇండ్ల నిర్మాణ అనుమతులలో అక్రమాలు

**పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:**

రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్ మండలంలోని ఇనాంగూడ, లష్కర్‌గూడ గ్రామాల్లో ఇండ్ల నిర్మాణ అనుమతుల విషయంలో అక్రమాలు జరిగాయనే ఆరోపణలతో జిల్లా లెవల్ ప్లానింగ్ ఆఫీసర్ (డీఎల్‌పీఓ) సాధన రెడ్డి గురువారం ఫీల్డ్ విజిట్ నిర్వహించారు. గ్రామస్థుల ఫిర్యాదు మేరకు, ఎలాంటి చట్టబద్ధ అనుమతులు లేకుండా గేటెడ్ కమ్యూనిటీ పేరుతో వెంచర్ వేసి నిర్మాణాలు చేపట్టిన వారికి, స్థానిక పంచాయతీ అధికారులు నకిలీ అనుమతులు జారీ చేశారన్న ఆరోపణలు వెలువడిన నేపథ్యంలో డీఎల్‌పీఓ సాధన రెడ్డి ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె గ్రామస్థులను కలిసి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలోని నిర్మాణ అనుమతుల ఫైల్స్ పరిశీలించారు. చట్టబద్ధంగా అనుమతులు ఇస్తున్నారా లేదా ఇష్టానుసారంగా పంచాయతీ సిబ్బంది జారీ చేస్తున్నారా అనే అంశంపై సమగ్రంగా విచారణ చేపట్టారు.ప్రత్యేకంగా ఇనాంగూడ గ్రామంలోని సర్వే నంబర్ 57 పరిధిలో అనుమతులు లేకుండానే నిర్మాణాలు జరిగాయని, కొన్ని అనుమతులు ఆఫ్‌లైన్‌లో ఇచ్చి అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయని తెలిసింది. అనుమతుల ఫైల్స్‌లో గ్రామ సెక్రటరీ సంతకం ఉన్నా, సర్పంచ్ సంతకం లేని రికార్డులు కూడా కనిపించాయని సమాచారం. గ్రామానికి చెందిన వెంకటేష్‌గౌడ్ అనే వ్యక్తి గత నెల 27న ఈ అక్రమాలపై జిల్లా అధికారులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు గుర్తించారు.




విశాల భారతి
తెలుగు దిన పత్రిక
సినిమా
హైదరాబాద్
శనివారం
25 అక్టోబర్ 2025
CINEMA



## కాంతార చాప్టర్ 1 కలెక్షన్స్..
# 2025లోనే తోపు..!

కన్నడ నటుడు కమ్ డైరెక్టర్ రిషబ్ శెట్టి రూపొందించిన ది మోస్ట్ అవైటెడ్ చిత్రం 'కాంతార చాప్టర్ 1' దసరా కానుకగా అక్టోబర్ 2న గ్రాండ్ రిలీజ్ అయింది. ఈ సినిమా పాన్ ఇండియా చిత్రంగా ప్రేక్షకులను మెప్పిస్తూ బాక్సాఫీస్ దగ్గర సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. ఇక ఈ సినిమాకు వస్తున్న ట్రెమండస్ రెస్పాన్స్‌తో ఈ సినిమా బాక్సాఫీస్ దగ్గర వసూళ్ల వర్షం కురిపిస్తోంది. తాజాగా ఈ చిత్రం వరల్డ్‌వైడ్‌గా ఏకంగా రూ.818 కోట్ల మేర గ్రాస్ వసూళ్లు రాబట్టినట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. దీంతో ఈ సినిమా 2025లో హయ్యెస్ట్ వసూళ్లు రాబట్టిన సినిమాగా రికార్డు క్రియేట్ చేసింది. ఇప్పటివరకు ఈ రికార్డు బాలీవుడ్ చిత్రం 'ఛావా' పేరుపై ఉండగా.. ఇప్పుడు కాంతార చాప్టర్ 1 ఆ రికార్డును బద్దలు కొట్టింది. ఇక ఈ సినిమాలో రుక్మిణి వసంత్ హీరోయిన్‌గా నటించగా హొంబలే ఫిల్మ్స్ ఈ సినిమాను ప్రొడ్యూస్ చేశారు.

# మోహన్‌లాల్‌కు ఐవరీ ఓనర్‌షిప్ రద్దు



మలయాళ సూపర్ స్టార్ మోహన్‌లాల్‌కు సంబంధించిన ఏనుగు దంతాల కేసులో కేరళ హైకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. నటుడి వద్ద ఉన్న దంతాల సేకరణను చట్టబద్ధం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం గతంలో జారీ చేసిన యాజమాన్య ధృవీకరణ పత్రాలు చట్టవిరుద్ధమని, న్యాయపరంగా అమలు చేయడానికి అనర్హమని కోర్టు తాజాగా ప్రకటించింది. జస్టిస్ ఏ.కె. జయశంకరన్ నంబియార్, జస్టిస్ జోబిన్ సెబాస్టియన్‌లతో కూడిన డివిజన్ బెంచ్ ఈ తీర్పును ఇవ్వగా.. ఈ తీర్పుతో మోహన్‌లాల్ ఏనుగు దంతాల కేసు మరోసారి కొత్త మలుపు తిరిగింది.2016 జనవరి, ఏప్రిల్ నెలల్లో ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ ద్వారా మోహన్‌లాల్‌కు జారీ చేసిన యాజమాన్య ధృవీకరణ పత్రాలను వాటికి సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులను కోర్టు తాజాగా కొట్టివేసింది. ఈ ఉత్తర్వులను జారీ చేసేటప్పుడు వన్యప్రాణి సంరక్షణ చట్టం లోని విధానపరమైన నిబంధనలను పాటించలేదని, ముఖ్యంగా తప్పనిసరిగా ఉండాల్సిన అధికారిక గెజిట్ ప్రచురణ జరగలేదని న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ కారణంగా ప్రభుత్వ ఉత్తర్వులు ప్రారంభం నుంచే చెల్లనివి అని పేర్కొంది. అయితే వన్యప్రాణి సంరక్షణ చట్టం, 1972లోని సెక్షన్ 44 ప్రకారం చట్టపరమైన నిబంధనలను అనుసరించి, అవసరమైన అన్ని ప్రక్రియలను పాటించిన తర్వాత కొత్త నోటిఫికేషన్‌ను జారీ చేసే స్వేచ్ఛ రాష్ట్ర ప్రభుత్వానికి ఉంటుందని హైకోర్టు తెలిపింది. మరోవైపు ఈ అంశంపై నటుడిపై ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ కేసు విచారణకు తమ తీర్పు అడ్డంకి కాదని కోర్టు స్పష్టం చేసింది. ధృవీకరణ పత్రాలు ఎలా జారీ చేయబడ్డాయనే అంశంపై తాము వ్యాఖ్యానించడం లేదని అలా చేస్తే క్రిమినల్ కేసు విచారణపై ప్రభావం పడుతుందని బెంచ్ తెలిపింది.2012లో మోహన్‌లాల్ నివాసంలో ఆదాయపు పన్ను శాఖ అధికారులు సోదాలు చేసినప్పుడు రెండు జతల ఏనుగు దంతాలు లభించాయి. ఈ దంతాలకు సంబంధించి సరైన అనుమతులు లేకపోవడంతో అటవీ శాఖ ఆయనపై వన్యప్రాణి సంరక్షణ చట్టం కింద కేసు నమోదు చేసింది.




బాలీవుడ్ గ్లామర్ డాల్ జాన్వీ కపూర్ ఎప్పుడూ ఏదో ఒక కారణంతో వార్తల్లో నిలుస్తూనే ఉంటుంది. లెజెండరీ నటి శ్రీదేవి కుమార్తె కావడంతో ఆమె ప్రతి మాట, ప్రతి నిర్ణయం నెటిజన్లలో చర్చనీయాంశమవుతాయి. తాజాగా జాన్వీ చాలా కాలంగా సాగుతున్న "ప్లాస్టిక్ సర్జరీ" వాదనలపై స్పందించి, అందరికీ క్లారిటీ ఇచ్చింది. కాజోల్, ట్వింకిల్ హోస్ట్ చేసిన టాక్ షో "టూ మచ్ విత్ కాజోల్ అండ్ ట్వింకిల్" లో పాల్గొన్న జాన్వీ కపూర్ ఈ విషయంపై ఓపెన్‌గా మాట్లాడింది. "అవును, నేను ప్లాస్టిక్ సర్జరీ చేయించుకున్నాను. కానీ అది తల్లి శ్రీదేవి మార్గదర్శకత్వంలోనే జరిగింది" అని స్పష్టం చేసింది.జాన్వీ మాట్లాడుతూ, నా ప్రతి నిర్ణయం వెనుక అమ్మ సలహా ఉంది. ఆమె అనుభవం వల్లనే నేను తప్పులు చేయకుండా ముందుకు వచ్చాను. యువతులు సోషల్ మీడియాలో చూసినదాన్ని బ్లైండ్‌గా ఫాలో అవ్వకూడదు. ఎవరో చేసినట్టు మనం సర్జరీ చేయించుకోవాలని అనుకోవడం ప్రమాదకరం. అందుకే పారదర్శకత చాలా ముఖ్యం" అని జాన్వీ సూచించింది. జాన్వీ ఈ సందర్భంలో "బఫెలో-ప్లాస్టీ" అనే పదంపై కూడా స్పందించింది. తాను ఏ సర్జరీలు చేయించుకుందో వివరించకపోయినా, ఇకపై దాచిపెట్టేది ఏదీ ఉండదని చెప్పింది. "ఇక నుంచి నేను ఓపెన్ బుక్‌లా ఉంటాను. నేను ఎలాంటి నిర్ణయాలు తీసుకున్నా వాటిని బహిరంగంగానే చెబుతాను" అని స్పష్టంగా తెలిపింది. సోషల్ మీడియాలో తన రూపం, దుస్తులు, బ్యూటీ ట్రీట్‌మెంట్‌లపై వస్తున్న విమర్శల గురించి మాట్లాడుతూ, "మన శరీరాన్ని మనం అంగీకరించడం సిగ్గు కాదు. సోషల్ మీడియా మన ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీయవచ్చు, కానీ మనం నిజాయితీగా ఉండటం ముఖ్యం" అని జాన్వీ పేర్కొంది. అమ్మ ఎప్పుడూ నా బలం. నా ప్రతి అడుగులో ఆమె ముద్ర ఉంటుంది. ఆమె నన్ను ప్రేమతో చూసుకునేది, మార్గదర్శకురాలిగా ఉండేదని పేర్కొంది. ప్రస్తుతం జాన్వీ కపూర్ రామ్ చరణ్ హీరోగా నటిస్తున్న భారీ బడ్జెట్ సినిమా "పెద్ది" షూటింగ్‌లో బిజీగా ఉంది. అంతకుముందు ఆమె దేవర చిత్రంతో తెలుగు ప్రేక్షకుల మనసు దోచుకుంది.

## ప్లాస్టిక్ సర్జరీపై స్పందించిన
# జాన్వీ కపూర్



## అఖండ 2 బ్లాస్టింగ్ రోర్..
# స్పీకర్లు జాగ్రత్త..!

గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ నటిస్తున్న ది మోస్ట్ అవైటెడ్ మూవీ 'అఖండ 2' కోసం ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ సినిమాను దర్శకుడు బోయపాటి శ్రీను డైరెక్ట్ చేస్తుండగా పూర్తి యాక్షన్ డ్రామాగా ఈ మూవీ ప్రేక్షకులను థ్రిల్ చేసేందుకు రెడీ అయింది. ఇక ఈ సినిమా నుండి మేకర్స్ తాజాగా బ్లాస్టింగ్ రోర్ అంటూ ఓ సాలిడ్ అప్డేట్‌ను వదిలారు. ఈ బ్లాస్టింగ్ రోర్ వీడియో గ్లింప్స్‌తో బాలయ్య మరోసారి పూనకాలు తెప్పించాడు. బాలయ్య తనదైన మార్క్ పవర్‌ఫుల్ డైలాగ్ డెలివరీతో అదిరిపోయే ఇంపాక్ట్ క్రియేట్ చేశాడు. దానికి తోడు థమన్ థండరింగ్ బీజీఎం ఈ గ్లింప్స్‌ను నెక్స్ట్ లెవెల్‌కు తీసుకెళ్లింది. బాలయ్య-థమన్ కాంబినేషన్ ఎందుకు అంత స్పెషల్ అనేది మరోసారి ఈ బ్లాస్టింగ్ రోర్‌తో నిరూపించారు. ఇక ఈ సినిమాలో ఆది పినిశెట్టి విలన్ పాత్రలో నటిస్తుండగా 14 రీల్స్ ప్లస్ బ్యానర్ పై గోపీ ఆచంట, రామ్ ఆచంట ఈ చిత్రాన్ని ప్రొడ్యూస్ చేస్తున్నారు. ఈ చిత్రాన్ని డిసెంబర్ 5న గ్రాండ్ రిలీజ్ చేసేందుకు మేకర్స్ రెడీ అవుతున్నారు.



# ఓటీటీలోకి ఇడ్లీ కొట్టు.. ఎప్పుడంటే..?

తమిళ స్టార్ నటుడు ధనుష్ హీరోగా నటిస్తూ డైరెక్ట్ చేసిన లేటెస్ట్ చిత్రం ఇడ్లీ కడాయ్ తెలుగులో ఇడ్లీ కొట్టు టైటిల్‌తో అక్టోబర్ 1న గ్రాండ్ రిలీజ్ అయింది. ఈ సినిమాలో ధనుష్ రెండు వైవిధ్యమైన షేడ్స్‌లో కనిపించడంతో ఈ సినిమాపై ప్రేక్షకుల్లో బజ్ క్రియేట్ అయింది. ఇక ఈ సినిమాకు బాక్సాఫీస్ దగ్గర మంచి రెస్పాన్స్ దక్కింది. సినిమా ఇప్పుడు ఓటీటీ ప్రేక్షకులను మెప్పించేందుకు రెడీ అయింది. ఈ సినిమా డిజిటల్ రైట్స్‌ను ప్రముఖ ఓటీటీ దిగ్గజం నెట్‌ఫ్లిక్స్ సొంతం చేసుకుంది. దీంతో ఈ సినిమాను అక్టోబర్ 29 నుంచి ఓటీటీ స్ట్రీమింగ్ చేస్తున్నట్లు నెట్‌ఫ్లిక్స్ వెల్లడించింది. ఈ చిత్రాన్ని తమిళ, తెలుగు భాషలతో పాటు హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో కూడా స్ట్రీమింగ్ చేయనున్నారు. ఇక ఈ సినిమాలో నిత్యా మీనన్ హీరోయిన్‌గా నటించగా అరుణ్ విజయ్, షాలిని పాండే, సత్యరాజ్, సముద్రఖని, రాజ్‌కిరణ్ తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో నటించారు. జి.వి. ప్రకాష్ కుమార్ ఈ చిత్రానికి సంగీతం అందించారు.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No - APTEL/2010/32877.